

నేడు భామినికి సీఎం రాక

భామిని, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శుక్రవారం ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని భామిని మండల కేంద్రానికి రానున్నారు. భామిని మోడల్ స్కూల్‌లో జరగనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశం (పీటీఎం)లో ఆయన పాల్గొనున్నారు. సీఎంతో పాటు మంత్రి నారా లోకేశ్, ఉన్నతాధికారులు హాజరుకానున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు విశాఖపట్నం నుంచి నేరుగా హెలికాప్టర్ ద్వారా ఉదయం 10.20 గంటలకు భామిని చేరుకుంటారు. 10.30 గంటలకు ఏపీ మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాల వద్ద ఏర్పాటు చేసిన వేదిక వద్దకు రోడ్డు మార్గంలో చేరుకుంటారు. మధ్యాహ్నం 2 గంటల వరకు మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొంటారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. పాఠశాల ఆవరణలోనే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశమయ్యే వేదికను ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. గురువారం ఏర్పాట్లను మంత్రి అచ్చెన్నాయుడు పరిశీలించి.. అధికారులకు పలు సూచనలు చేశారు.



మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న కూటమి నాయకులు, కార్యకర్తలు


మంత్రి లోకేశ్‌తో అచ్చెన్న ముచ్చట్లు

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

కొత్తూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు గురువారం రాత్రి కూటమి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. పార్వతీపురం మన్యం జిల్లా భామిని మండలంలో శుక్రవారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశం(పీటీఎం)లో మంత్రి లోకేశ్ పాల్గొనున్నారు. ఈ మేరకు గురువారం రాత్రే ఆయన జిల్లా మీదుగా భామిని చేరుకున్నారు. పాలకొండ నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు.. మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలికి కాసేపు ముచ్చటించారు. అలాగే కొత్తూరులో పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి, అధిక సంఖ్యలో కార్యకర్తలు స్వాగతం పలికారు. అందరికీ లోకేశ్ అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు భద్రత కల్పించారు.

తల్లిదండ్రులతో ఆత్మీయంగా!

- నేడు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్
- పాఠశాలలు, కళాశాలల్లో నిర్వహణకు ఏర్పాట్లు


ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో శుక్రవారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహించనున్నారు. జిల్లాలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు 2014, ప్రాథమికోన్నత 148, ఉన్నత పాఠశాలలు 450 ఉన్నాయి. వీటిలో 1,63,115 మంది చదువుతున్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో సుమారు 39 వేల మంది విద్యనభ్యసిస్తున్నారు. ఈ విద్యార్థుల తల్లిదండ్రులతో ఉపాధ్యాయులు, అధ్యాపకులు సమావేశాలు నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు స్వాగతోపన్యాసంతో కార్యక్రమం ప్రారంభమై మధ్యాహ్నం 12.45 గంటల వరకూ కొనసాగుతుంది. విద్యార్థి ఎలా చదువుతున్నారు? మరింత నాణ్యమైన విద్యను అందించేందుకు బోధనలో ఎటువంటి మార్పులు చేయాలి?.. ఇలా వివిధ అంశాలపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వారి అభిప్రాయాలను పంచుకుంటారు. పరీక్షల్లో సాధిస్తున్న మార్కులు, ఆరోగ్య సమాచారంతో కూడిన ప్రోగ్రెస్ రిపోర్టు కూడా అందిస్తారు. పిల్లల ప్రవర్తన, క్రమశిక్షణ తీరును సైతం చర్చిస్తారు. సబ్జెక్టుల వారీగా ప్రమాణ స్థాయి, వెనుకబడిన వారి విషయంలో తీసుకుంటున్న చర్యలు, దృష్టి పెట్టాల్సిన అంశాల గురించి వివరిస్తారు.


శాసనాం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల

దారి మారలేదు.. బాధ తీరలేదు!



- మెళియాపుట్టి మండలం అంపురం గ్రామం నుంచి ఎగువరింపి వరకు 2.30 కిలోమీటర్ల మేర రహదారి నిర్మాణానికి రూ.1,72,50,000 నిధులు కొన్నాళ్ల కిందట మంజూరు చేశారు. రహదారి పనులు ఇంతవరకూ ప్రారంభించకపోవడంతో గిరిజనులు ఇబ్బందులు పడుతున్నారు. చిన్నపాటి వర్షం కురిసినా వాహనాలు బురదలో కూరుకుపోతున్నాయని పేర్కొంటున్నారు.





- మెళియాపుట్టి మండలం కొండపై ఉన్న కేరాశింగి గ్రామంలో రహదారి నిర్మాణానికి ఇప్పటివరకు రూ.3.95 కోట్ల నిధులు మంజూరైనా పనులు పూర్తికాలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో పనులు పూర్తికాకుండానే బిల్లులు చేయించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కూటమి ప్రభుత్వం మరో రూ.40 లక్షలు మంజూరు చేయగా.. కొంతమేర సీసీ రోడ్డు నిర్మించి వదిలేశారు. గతంలో వేసిన మెటల్ రోడ్డు ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయింది. దీంతో కేరాశింగితోపాటు గూడ గ్రామాలకు వెళ్లలేని దుస్థితి నెలకొంది.

- మెళియాపుట్టి మండలం ఎం.ఎస్.రోడ్డు నుంచి కుడ్డబ మీదుగా రాజపురం వరకు 5 కిలోమీటర్ల రహదారి నిర్మాణానికి ఏడాది కిందట రూ.2కోట్ల నిధులు మంజూరు చేశారు. కానీ ఇప్పటివరకు పనులు పూర్తికాకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉన్నరోడ్డు తవ్వేసి.. పనులు మధ్యలో వదిలేయడంతో రాళ్లు తేలి వాహనాలు వెళ్లలేని దుస్థితి నెలకొంది. ఈ రహదారి మీదుగా వెళితే.. వాహనాలు పాడైపోతున్నాయని ఈ ప్రాంతవాసులు వాపోతున్నారు.

- గిరిజన గ్రామాల్లో పూర్తికాని రహదారులు
- పట్టించుకోని ఐటీడీఏ అధికారులు

మెళియాపుట్టి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వాలు, పాలకులు మారుతున్నా గిరిజన గ్రామాల్లో రహదారులు బాగు పడడం లేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కేంద్రం ఎన్ఆర్‌జీఎస్ నిధులు మంజూరు చేసినా గిరిజన గ్రామాల్లో రహదారుల పనులు పూర్తికాలేదు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్.. గిరిజన గ్రామాల్లో డోలీ మోతలు కనిపించరాదనే ఉద్దేశంతో రహదారుల నిర్మాణానికి నిధులు మంజూరు చేశారు. ఉమ్మడి జిల్లాలోని సీతంపేట ఐటీడీఏ పరిధిలో 13 మండలాల్లో 165 పనులకు సంబంధించి రూ.85.48 కోట్లు మంజూరు చేయగా, ఇప్పటివరకూ రూ.15.79 కోట్లు ఖర్చు చేసినట్టు ఇంజనీరింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు. 8 రహదారులు మాత్రమే పూర్తయ్యాయి. మరో 135 రహదారులు వివిధ దశల్లో ఉన్నాయి. మిగిలినవి ఇంకా పనుల ప్రారంభానికి నోచుకోలేదు. ఐటీడీఏ ఇంజనీరింగ్ శాఖ అధికారుల్లో కదలిక లేదనే ఉద్దేశంతో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కొన్నాళ్ల కిందట రూ.20.36 కోట్ల మేర నిధులకు సంబంధించి 16 రహదారుల పనులను పంచాయతీరాజ్ శాఖకు అప్పగించారు. కాగా ఆ పనులను మళ్లీ ఐటీడీఏకు బదలాయించాలని కొంతమంది ప్రయత్నిస్తున్నట్టు తెలుస్తోంది. ఇతర జిల్లాలకు చెందిన కాంట్రాక్టర్లు పనులు చేపడు తుండగా.. వారికి కొంతమంది అధికారపార్టీ నేతలు కొమ్ముకాస్తు న్నానే ఆరోపణలు ఉన్నాయి. అలాగే చేసిన పనులకు బిల్లులు కావడం లేదని కాంట్రాక్టర్లు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో రహదారి పనులు పూర్తిచేసేందుకు ఆసక్తి చూపడం లేదు.

ఇంజనీరింగ్ శాఖలో సమన్వయ లోపం?

ఐటీడీఏ ఇంజనీరింగ్ అధికారుల్లో సమన్వయలోపంతో పనులు పురోగతి లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. గతంలో పాతపట్నం సెక్షన్‌లో పనిచేసిన ఒక ఇంజనీరింగ్ అధికారిపై పలు ఆరోపణలు రాగా సస్పెన్షన్ చేశారు. అలాగే ఐటీడీఏ (మిగతా 6వ పేజీలో..)


ఇచ్ఛాపురం: వసతిగృహంలో నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు.. అరకొరగా దుప్పట్లు

వసతులు లేని గృహాలు

- పూర్తి స్థాయిలో అందని దుప్పట్లు
- చలికి వణుకుతున్న విద్యార్థులు
- అనేకచోట్ల వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య

ఆంధ్రజ్యోతి పరిశీలన

పేద విద్యార్థుల సంక్షేమం కోసం ఏర్పాటు చేసిన వసతిగృహాల్లో అధ్వాన పరిస్థితులు నెలకొన్నాయి. విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. వార్డెన్లు, అధికారుల పర్యవేక్షణ లేక విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. చాలాచోట్ల పారిశుధ్యం అధ్వానంగా ఉంది. విద్యార్థుల సంఖ్యకు తగినన్ని మరుగుదొడ్లు, స్నానపు గదులు లేవు. విద్యార్థులు పడుకోవడానికి కనీసం చాపలు, కప్పుకోవడానికి దుప్పట్లు కూడా లేవు. రక్షిత తాగునీరు అందని ద్రాక్షే. అధికశాతం సంక్షేమ వసతిగృహాల్లో మెనూ సక్రమంగా అమలు కాక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 6లో


టెక్కలి: బాలికల వసతిగృహంలో అరకొరగా మరుగుదొడ్ల సౌకర్యం

చదువు కోసం వెళ్లి.. విగతజీవిగా మారి

- బీసీ కళాశాల వసతిగృహంలో విద్యార్థిని అనుమానాస్పద మృతి
- దుఃఖ సాగరంలో తల్లిదండ్రులు

విజయనగరం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విజయనగరం ప్రభుత్వ బీసీ కళాశాల వసతిగృహంలో ఓ డిగ్రీ విద్యార్థిని గురువారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందింది. అప్పటివరకూ తోటి పిల్లలతో సరదాగా గడిపిన ఆమె అంతలోనే విగతజీవిగా మారడం చూసిన తోటి విద్యార్థులు విషాదంలో ఉండిపోయారు. అచేతన స్థితిలో కుమార్తెను చూసిన తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు. విద్యార్థులు, పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లా గార మండలం చినతోణంగి గ్రామానికి చెందిన కల్లి స్వాతి(17) ఈ ఏడాది ఎంఆర్ (మిగతా 6వ పేజీలో..)


కల్లి స్వాతి (ఫైల్)

జిల్లాలో మూడు డీడీవో కార్యాలయాలు ప్రారంభం

- గ్రామీణాభివృద్ధికి పెద్దపీట: మంత్రి అచ్చెన్నాయుడు 6లో


టెక్కలి: డీఎల్‌డీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రి అచ్చెన్నాయుడు

8న ఐటీఐలో అప్రంటీస్ మేళా

ఎచ్చెర్ల, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని ప్రభుత్వ ఐటీఐలో ప్రధాన మంత్రి జాతీయ గ్రామీణ అప్రంటీస్ మేళా ఈ నెల 8న నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్, జిల్లా అడ్మిషన్ల కన్వీనర్ ఎల్.సుధాకరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐల్లో వివిధ ట్రేడుల్లో శిక్షణ పూర్తిచేసి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ మేళాలో పాల్గొనవచ్చు. బయోడేటా, ఐటీఐ, ఆధార్, పదోతరగతి జిరాక్స్ కాపీలు మూడు సెట్లు, మూడు కలర్ ఫొటోలతో హాజరు కావాలి. దీపక్ మైనింగ్ సొల్యూషన్స్ లిమిటెడ్(పొన్నాడ), అరబిందో (పైడిభీమవరం), జయభేరి(పలాస, శ్రీకాకుళం) తదితర 9 కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటున్నాయి. ఆసక్తి గల అభ్యర్థులు 8న ఉదయం 9 గంటలకు హాజరు కావాలని ప్రిన్సిపాల్ సుధాకరరావు సూచించారు.

వ్యసనాలకు బానిసై.. దొంగలుగా మారి

- 8 ఆలయాల్లో చోరీకి పాల్పడిన ముగ్గురి అరెస్టు
- వెండి, ఇత్తడి వస్తువుల రికవరీ

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆ ముగ్గురు యువకులు చెడు వ్యసనాలకు బానిసై.. వేర్వేరుగా చోరీల బాట పట్టారు. ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసుల్లో అరెస్టు అయి జైలుకెళ్లారు. అక్కడ ముగ్గురూ స్నేహితులయ్యారు. జైలు నుంచి బయటకు వచ్చిన తర్వాత కూడా వారి బుద్ధి మారలేదు. కొన్నాళ్లుగా ముగ్గురూ కలిసి ఆలయాల్లో చోరీలకు పాల్పడుతూ.. శ్రీకాకుళం రూరల్ పోలీసులకు చిక్కారు. శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ సీహెచ్ వివేకానంద ఆ ముగ్గురు నిందితులను తన కార్యాలయంలో గురువారం మీడియా ముందు ప్రవేశపెట్టి.. వివరాలను వెల్లడించారు. శ్రీకాకుళం మండలం కళ్లేపల్లి గ్రామానికి (మిగతా 6వ పేజీలో..)


మాట్లాడుతున్న డీఎస్పీ వివేకానంద, పోలీసుల అదుపులో నిందితులు

గొర్రెలమందపై మళ్లీ కుక్కల దాడి


మృతిచెందిన మేకపిల్లల వద్ద బాధితులు

- కొంచాడలో ఐదు మేకలు మృతి
- మూడు రోజుల క్రితం 42 గొర్రెలు..
- అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థుల ఆగ్రహం

పొందూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పొందూరు మండలం కొంచాడలో కుక్కల దాడులతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. ఈ నెల 2న కురమాన రమణ, గౌరునాయుడుకు (మిగతా 6వ పేజీలో..)

7న జవహర్ నవోదయ నమూనా పరీక్ష

- ఎర్రన్న విద్యా సంకల్పం ఆధ్వర్యంలో ఐదు కేంద్రాల్లో నిర్వహణ

7లో

మరమ్మతులు లేక.. విస్తరణకు నోచుకోక

- అధ్వానంగా పూండి రోడ్డు
- 50 గ్రామాల ప్రజలకు ఇక్కట్లు

సహకార కేంద్ర స్టోర్స్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలం పొడిగింపు

శ్రీకాకుళం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం వినియోగదారుల సహకార కేంద్ర స్టోర్స్ లిమిటెడ్‌కు సంబంధించిన ప్రస్తుత అఫిషియల్ పర్సన్ ఇన్‌చార్జి పదవీకాలాన్ని ప్రభుత్వం ఆరు నెలలపాటు పొడిగించింది. వచ్చే ఏడాది మే 14 వరకు గడువు పెంచింది. ఈలోగా ఎన్నికలు నిర్వహించి.. కొత్త పాలకవర్గం బాధ్యతలు స్వీకరిస్తే... ఆ తేదీ వరకే ఈ బాధ్యతలు వర్తిస్తాయి. ఈ మేరకు గురువారం ఎక్స్ అఫీషియో స్పెషల్ చీఫ్ సెక్రటరీ బి.రాజశేఖర్ ఉత్తర్వులు జారీచేశారు.

క్రిమినల్ కేసులకు కొత్త పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నియామకం

శ్రీకాకుళం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో వైఎస్ఆర్ కడప, శ్రీకాకుళం, విజయనగరం, ఎస్‌పీఎస్ఆర్ నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లోని పలు క్రిమినల్ కేసుల విచారణ బాధ్యతలను వేరే ప్రాసిక్యూటర్లకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. ఈ మేరకు గురువారం హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజిత్ ఉత్తర్వులను జారీచేశారు. డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ సిఫారసుల మేరకు ఆయా జిల్లాల్లో కొన్ని నిర్దిష్ట కేసులు 'కౌంటర్ కేసులు' కావడంతో న్యాయ విచారణ పారదర్శకత కోసం వాటిని వేరే ప్రాసిక్యూటర్లకు బదలాయించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇందులో భాగంగా రాజాం అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టులోని ఎస్‌సీ. 41/2025 కేసు బాధ్యతలను శ్రీకాకుళం పోక్సో కోర్టు స్పెషల్‌పబ్లిక్ ప్రాసిక్యూటర్‌కు అప్పగించారు.

వసతులు లేని గృహాలు

జిల్లాలోని బీసీ, ఎస్సీ వసతి గృహాల్లో సరైన సౌకర్యాలు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. అత్యధిక శాతం హాస్టళ్లు అద్దె భవనాల్లో నడుస్తుండడంతో మరుగుదొడ్లు, స్నానాల గదుల సమస్య వేధిస్తోంది. అనేక వసతి గృహాలు ఇన్‌చార్జులతోనే నడుస్తున్నాయి. దీంతో పర్యవేక్షణ కరువవుతోంది.

- పూర్తిస్థాయిలో అందని దుప్పట్లు
- చలికి వణుకుతున్న విద్యార్థులు
- అనేకచోట్ల వేధిస్తున్న మరుగుదొడ్ల సమస్య


ఫరీద్‌పేట బీసీ హాస్టల్‌లో నిద్రిస్తున్న విద్యార్థులు

ఆంధ్రజ్యోతి పరిశీలన


పాతపట్నం: వసతి గృహంలో విద్యార్థుల ఇక్కట్లు

తిరగని ఫ్యాన్లు.. తలుపులు లేని మరుగుదొడ్లు

పాతపట్నం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక సాంఘిక సంక్షేమ బాలుర సమీకృత వసతి గృహంలో 64మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి ఈ ఏడాది మొదటిలోనే దుప్పట్లు ఇచ్చారు. కానీ సౌకర్యాలు మాత్రం అరకొరగానే ఉన్నాయి. ప్రధానంగా మరుగుదొడ్లకు తలుపులు లేవు. రన్నింగ్ వాటర్ మరుగుదొడ్లకు, బాత్‌రూంలకు చేరడం లేదు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. కాస్మెటిక్స్ డబ్బులు పడడంలేదని తెలుపుతున్నారు. పదో తరగతి విద్యార్థులకు నెలకు రూ.165 మిగిలిన వారికి నెలకు రూ.140 వంతున చెల్లించాలి. కానీ వాటి జాడే లేదు. కొన్ని గదులలో ఫ్యాన్లు తిరగకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు.

అరకొరగా దుప్పట్లు..


మెళియాపుట్టి : విద్యార్థులకు అరకొర దుప్పట్లు

మెళియాపుట్టి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): వసతి గృహంలో అరకొరగా దుప్పట్లు పంపిణీ చేసినట్లు విద్యార్థులు చెబుతున్నారు. చాపర ఎఫ్‌పివసతి గృహంలో 89 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి గత ఏడాది దుప్పట్లు ఇవ్వలేదు. ఈ ఏడాది జూలై నెలలో కొంతమందికే ఇచ్చారని చెబుతున్నారు. మరి కొంత మందికి ఇవ్వకపోవటంతో ఇంటి నుంచి తెచ్చుకుంటున్నామని అంటున్నారు. చలి గాలులు వీస్తుడడంతో వణుకుతున్నారు. ఇదిలా ఉంటే కొంత మంది విద్యార్థులకు అందిన దుప్పట్లు తమ ఇళ్ల వద్ద వదిలేసినట్లు సమాచారం.

దుప్పట్లు లేవు..


పలాస రూరల్: దుప్పట్లు లేకుండా నిద్రిస్తున్న విద్యార్థులు

పలాస రూరల్, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం పోస్టుమెట్రిక్ ట్రైబల్ వెల్ఫేర్ బాలుర వసతి గృహంలో మొత్తం 130 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. దుప్పట్లను ప్రభుత్వం సరఫరా చేయకపోవడంతో విద్యార్థులు చలిలో ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుతం చలి అధికంగా ఉండడంతో వారు తెచ్చుకున్న దుప్పట్లనే వాడుతున్నారు. గత ఏడాది నుంచి పూర్తిస్థాయిలో దుప్పట్లు ఇవ్వలేదని చెబుతున్నారు.

ఒకవైపు దోమలు.. మరో వైపు చలి


నరసన్నపేట: నేలపై కూర్చొని చదువుతున్న విద్యార్థినులు

నరసన్నపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నరసన్నపేట మండలంలో నాలుగు బాలికలు, బాలురు వసతి గృహాలు, రెండు కళాశాలల్లో మొత్తం ఆరు వసతి గృహాలు ఉన్నాయి. బీసీ బాలికలు, సాంఘికసంక్షేమ శాఖ బాలికలు, బాలురు, ఉర్లాం బీసీ హాస్టల్, కళాశాల మహిళలు, పురుషులు హాస్టల్స్ ఉన్నాయి. వసతి గృహాల్లో 700కు పైగా విద్యార్థులు ఉంటున్నారు. వీటిలో కళాశాల హాస్టళ్లలో 400 మంది ఉన్నారు. బాలికల వసతిగృహాల్లో అంగడిలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. దీంతో ఒక వైపు దోమల బెడద.. మరో వైపు చలితో ఇబ్బంది పడుతూ చదువుతున్నారు. కళాశాల బాలురు, బాలికల వసతిగృహాలు రెండు అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నారు. సదుపాయాలు లేకపోవడంతో విద్యార్థులు చలితో ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులకు ప్రభుత్వం దుప్పట్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేయలేదు. వీరంతా నేలమీద పడుకుంటూ ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఇంటి నుంచి తెచ్చుకున్న దుప్పట్లు కప్పుకుంటున్నామని తెలిపారు.

అద్దె భవనంలో..


శ్రీముఖలింగం : వసతిగృహంలో ఇరుకుగదిలో నిద్రిస్తున్న విద్యార్థులు

జలుమూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): శ్రీముఖలింగంలో గల బీసీ బాలుర వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. వసతి గృహంలో 80 మంది విద్యార్థులు ఉన్నారు. నాలుగు ఇరుకు గదులు మాత్రమే ఉన్నాయి. ఈ గదుల్లోనే భోజనాలు చేయడం, నిద్రపోవాల్సి వస్తోంది. దీంతో అవస్థలు తప్పడం లేదు. ఒక్కో గదిలో 20 మంది చొప్పున ఇరుకిరుకుగా సర్దుకుపోవాల్సి వస్తోంది. కేవలం నాలుగు మరుగుదొడ్లు ఉండడంతో అనేక పాట్లు పడుతున్నారు. ఒక్కో వార్డెన్‌కి నాలుగైదు వసతి గృహాలు అప్పగించడంతో ఇన్‌చార్జులతో నడుస్తున్నాయి. దీంతో విద్యార్థులను పట్టించుకొనే నాథుడు కనిపించడం లేదు.

పిచ్చిమొక్కలతో భయం..


కాశీబుగ్గ : హాస్టల్ లోపల పిచ్చి మొక్కలు..

కాశీబుగ్గ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): అక్కుపల్లి రోడ్డులో ఉన్న బాలుర బీసీ కళాశాల సంక్షేమ హాస్టల్‌లో సౌకర్యాలు లేవు. ఈ వసతి గృహంలో ఇంటర్, ఐటీఐ, డిగ్రీ విద్యార్థులు మొత్తం 75 మంది ఉన్నారు. గదులు శుభ్రంగా లేకపోవడం వల్ల విద్యార్థులు ఇబ్బందలకు గురవుతున్నారు. కిటికీల జాలీలకు రంధ్రాలు పడడంతో వాటికి వస్త్రాలు కట్టి చలి నుంచి రక్షించుకుంటున్నారు. విద్యార్థుల స్నానాల గదుల చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగాయి. వీటిలో విష సర్పాలు తిరిగే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. రాత్రి సమయంలో పర్యవేక్షణ లేకపోవడంతో విద్యార్థులు ఇష్టానుసా రంగా బయటకు వెళ్లి వస్తున్నారు. జరగరానిది ఏదైనా జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థినులకు తప్పని కష్టాలు..


టెక్కలి: జిల్లాపరిషత్ బాలికల హైస్కూల్ ప్లస్

టెక్కలి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జెడ్పీ బాలికల హైస్కూల్ ప్లస్ హాస్టల్‌లో విద్యార్థినుల సంఖ్యకు సరిపడా మరుగుదొడ్లు లేవు. దీంతో బాలికలు నిత్యం అవస్థలు పడుతున్నారు. ఇక్కడ ఆరు నుంచి పది తరగతుల వరకు 654 మంది బాలికలు, ఇంటర్మీడియట్ మొదటి, ద్వితీయ సంవత్సరాలకు కలిపి 155 మంది ఉన్నారు. వీరితో పాటు 30 మంది సిబ్బంది ఉన్నారు. ఈ బాలికలకు, ఉపాధ్యాయులకు కలిపి కేవలం 14 స్నానాల గదులు, ఏడు మరుగుదొడ్లు మాత్రమే ఉన్నాయి. తమ సంఖ్యకు తగ్గట్టుగా వాష్‌రూమ్‌లు, మరుగుదొడ్ల సౌకర్యం కల్పించాలని విద్యార్థినులు కోరుతున్నారు.

భోజనాలకు ప్లేట్లు ఇవ్వలేదు..


కవిటి: పికెపాలెంలో స్టడీ అవర్‌లో విద్యార్థులు

కవిటి, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో రాజపురం, పెద్దకర్రివాని పాలెం గ్రామాల్లో బీసీ బాలుర వసతి గృహాలు ఉన్నాయి. వీటిలో 200మంది వరకు ఉన్నారు. వారం రోజుల కిందట దుప్పట్లను పంపిణీ చేశారని విద్యార్థులు చెబుతున్నారు. పెద్దకర్రి వానిపాలెంలోని హాస్టల్‌లో విద్యార్థులు సమీప గ్రామాలకు చెందిన వారు కావటంతో కొంత మంది రాత్రి భోజనాలు చేసి ఇళ్లకు వెళ్లిపోతున్నారు. వీరికి దుస్తులు దాచుకునేందుకు మాత్రం ఎప్పుడో ఇచ్చిన పెట్టెలు మాత్రమే దర్శనమిస్తున్నాయి. భోజనాలు చేసేందుకు ప్లేట్లు సరఫరా చేయలేదు. దాంతో ఇళ్ల నుంచి తెచ్చుకుంటున్నారు. మరుగుదొడ్లు, తాగునీటి సదుపాయం అందుబాటులో ఉందని వార్డెన్లు ఉపేంద్ర, నారాయణ తెలిపారు.

చలితో ఇక్కట్లు..

ఎచ్చెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): బీసీ వసతి గృహాల విద్యార్థులకు ప్రస్తుత విద్యా సంవత్సరానికి సంబంధించి ఈ నెల మొదటి వారంలోనే బెడ్‌షీట్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఎచ్చెర్ల మండలం ఫరీదుపేట బీసీ వసతి గృహం అద్దె భవనంలో కొనసాగుతోంది. 1984లోనే బీసీ వసతి గృహం మంజూరైనా.. ఇప్పటికీ శాశ్వత భవనం సమకూరలేదు. ఈ హాస్టల్‌లో మొత్తం 23 మంది విద్యార్థులు మాత్రమే ఉన్నారు. పొందూరు మండలం తాడేవలస హాస్టల్ వార్డెన్ యతిరాజులు ఇన్‌చార్జిగా వ్యవరిస్తున్నారు.

ట్యూటర్లు లేరు..


జి.సిగడాం : సంతవురిటి వసతిగృహంలో భోజనాలు చేసే ముందు విద్యార్థుల ప్రార్థన

జి.సిగడాం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలో గల రెండు బీసీ బాలుర వసతి గృహాలలో మొత్తం 140 మంది విద్యార్థులు ఉన్నారు. జి.సిగడాం వసతి గృహంలో 48 విద్యార్థులకు ఒకొక్క దుప్పటి, బెడ్‌షీట్ చొప్పున అందజేసినట్లు వసతి గృహ ఇన్‌చార్జి సంక్షేమాధికారి తాలాడ అప్పారావు తెలిపారు. వసతి గృహ విద్యార్థులు ముగ్గురు ట్యూటర్లు అవసరం కాగా... ఒక్క ట్యూటరే సైన్స్, గణితం బోధిస్తున్నారు. సంతవురిటి బీసీ వాలుర వసతి గృహంలో 92మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కూడా దుప్పట్లు, బెడ్‌షీట్లు పంపిణీ చేశారు. సైన్స్, ఆంగ్లం బోధనకు మాత్రమే ట్యూటర్ ఉన్నారు.

నేలపైనే నిద్రిస్తున్న విద్యార్థులు..


ఇచ్ఛాపురం: హాస్టల్‌లో నిరుపయోగంగా మంచాలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురం పట్టణ పరిధి బెల్లుపడ కాలనీ సమీపంలోని గల బీసీ బాలుర వసతి గృహంలో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఇక్కడ 35మంది ఉంటున్నారు. ఇక్కడ మంచాలు ఉన్న చోట ఫ్యాన్లు లేకపోవటంతో విద్యార్థులు వేరే గదిలో నేలపైనే నిద్రిస్తున్నారు. చలికాలంలో నేలపై చలితో ఇబ్బందులు పడుతున్నారు. బోరు నీటినే తాగాల్సి వస్తోంది.

హాస్టల్‌కు తాళం..

కొళిగాం బీసీ బాలుర వసతి గృహంలో 50 మంది ఉండాలి. ఇటీవల 'ఆంధ్రజ్యోతి' సందర్శించినపుడు ఒక్కరు కూడా హాస్టల్‌లో లేరు. హాస్టల్‌కు తాళం వేసి ఉంది. ఈ విషయమై ఇన్‌చార్జి వార్డెన్ కాంతారావును ఫోన్‌లో సంప్రదించగా హాస్టల్ గ్రామానికి చివరిలో ఉండటం.. చుట్టూ తోటలు ఉండటంతో రాత్రిపూట విషపురుగుల సంచారం ఎక్కువగా ఉంటుందన్నారు. విద్యార్థులు భయంతో హాస్టల్‌లో ఉండడం లేదని తెలిపారు. సాయంత్రం భోజనం చేసిన తరువాత ఇళ్లకు వెళ్లిపోయి.. తిరిగి మరుసటి రోజు ఉదయం 6 గంటలకు వస్తున్నారని వార్డెన్ వివరించారు.


పోటీలను ప్రారంభిస్తున్న ఏవో డాక్టర్ ముని రామకృష్ణ

క్రీడలపై ఆసక్తి చూపాలి

- ఆర్జీయూకేటీ క్యాంపస్‌లో అంతర వర్సిటీ క్రీడాపోటీలు

ఎచ్చెర్ల, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి చూపాలని ఆర్జీయూకేటీ క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ కోరారు. గురువారం సాయంత్రం ఆర్జీయూకేటీ శ్రీకాకుళం క్యాంపస్‌లో అంతర వర్సిటీ క్రీడా పోటీలను ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడలతో గుర్తింపుతో ప్రయోజనం ఉంటుందన్నారు. క్యాంపస్‌లో స్పోర్ట్స్ బోర్డు ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జరిగే వాలీబాల్, చెస్ పోటీల్లో ఆర్జీయూకేటీ పరిధిలోని శ్రీకాకుళం, నూజివీడు, ఒంగోలు, ఆర్‌కే వ్యాలీ క్యాంపస్‌లకు చెందిన విద్యార్థులు పాల్గొంటున్నారు. ఏవో డాక్టర్ ముని రామకృష్ణ, అకడమిక్ డీన్ డాక్టర్ శివరామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, వెల్ఫేర్ డీన్ రవి, ఫిజికల్ డైరెక్టర్లు దిలీప్‌కుమార్, కృష్ణంరాజు, నవీన్, లావణ్య పాల్గొన్నారు.

జిల్లాలో మూడు డీడీవో కార్యాలయాలు

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని మూడు డివిజన్లల్లో డీడీవో కార్యాలయాలు ప్రారంభిస్తున్నట్లు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. గురువారం శ్రీకాకుళంలోని జడ్పీ కార్యాల యంలో డివిజనల్ అభివృద్ధి అధికారి కార్యాలయం(డీడీవో) ప్రా రంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉప ముఖ్యమంత్రి చిత్తూరు జిల్లా నుంచి వర్చువల్‌గా ప్రారంభించినట్లు పేర్కొన్నారు. అభివృద్ధికి సంబంధించిన అధికారులు డీడీవో కార్యాలయంలో ఉంటారని, డీపీవో కార్యాలయం నుంచి డివిజనల్ పంచాయతీ అధికారిని కూడా డీడీవో కార్యాలయం పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. డ్వామా కార్యాలయం నుంచి ఏపీడీ కూడా ఇక్కడే ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, జడ్పీ ఇన్‌చార్జి సీఈవో కిరణ కుమార్, డీపీవో కె. భారతి సౌజన్య, శ్రీకాకుళం డివిజనల్ అభివృద్ధి అధికారి అరుందతీ దేవి, జనసేన జిల్లా అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్, జనసేన యువనాయకులు బొట్ట శంకర్ పాల్గొన్నారు.


డీఎల్‌డీవో కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిరీష

గ్రామీణాభివృద్ధికి పెద్దపీట: మంత్రి అచ్చెన్నాయుడు..

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామీణ అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం టెక్కలిలో పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి కార్యాలయాన్ని (డీఎల్‌డీవో) ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతి గ్రామంలో అభివృద్ధి ప్రమాణాలు స్పష్టంగా కొలవబడతాయని, క్షేత్ర స్థాయిలో పర్యవేక్షణ కీలకం కానుండగా పారదర్శక, వేగవంతమైన సేవల అమలుకు, ప్రజల సేవల మెరుగుదలే ప్రభుత్వ లక్ష్యమని, గ్రామాలు బలపడితేనే రాష్ట్రం ముందుకు సాగుతుందని ఆయన తెలిపారు. అంతకుముందు పట్టుమహాదేవి కోనేరు గట్టుపై జరుగుతున్న అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం వైభవ వేంకటేశ్వరస్వామిని దర్శించుకున్నారు. ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఏఎంసీ చైర్మన్ బగాది శేషగిరి, హనుమంతు రామకృష్ణ, కోళ్ల లవకుమార్, కామేసు, జీఎస్ఎన్ రెడ్డి, రాము, సుందరమ్మ, ప్రసాద్‌రెడ్డి, లాడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.


డీడీవో కార్యాలయం ప్రారంభిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్

పంచాయతీ పాలన మరింత పటిష్టం: ఎమ్మెల్యే గౌతు శిరీష..

పలాసరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పంచాయతీ పాలన మరింత పటిష్టం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. పలాస మండల కాంప్లెక్స్‌లో గల డీఎల్‌డీవో నూతన కార్యాలయాన్ని గురువారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పలాస డివిజన్‌లో ఎనిమిది మండలాల్లోని సచివాలయ పరిపాలన వ్యవస్థను అనుసంధానం చేస్తూ డీఎల్‌డీవో పర్యవేక్షిస్తారన్నారు. కార్యక్రమంలో డివిజన్‌కు సంబంధించిన ఎంపీడీవోలు, డిప్యూటీ ఎంపీడీవోలు, డీడీవో బొడ్డేపల్లి శైలజ, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువు కోసం వెళ్లి.. విగతజీవిగా మారి

(ఐదో పేజీ తరువాయి)

అటానమస్ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరింది. బీఎస్సీ చదువుతూ బీసీ వసతిగృహంలో ఉంటోంది. గురువారం ఉదయం తోటి పిల్లలతో కొద్దిసేపు గడిపాక ఈరోజు కళాశాలకు రాను అని, ఒంట్లో నీరసంగా ఉందని చెప్పి గదిలోనే ఉండిపోయింది. కళాశాలకు వెళ్లిన మిగతా విద్యార్థులు తిరిగి వసతిగృహానికి వచ్చి గదిలోకి వెళ్లేసరికి స్వాతి ఫ్యానుకు వేళాడుతూ కన్పించింది. భయాందోళనతో పరుగులు తీసిన విద్యార్థినులు వసతి గృహం వార్డెన్‌కి సమాచారం అందించారు. వార్డెన్ కృష్ణవేణి హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని స్వాతిని కిందకు దించారు. కొనఊపిరితో ఉన్నట్టు భావించి 108 సమాచారం అందించారు. అనంతరం జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అప్పటికే ఆమె మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వార్డెన్ ఫిర్యాదుతో టూటౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కనకరాజు, క్లూస్ టీం అక్కడికి చేరుకుని వసతిగృహం పరిసరాలు, గదిలో ఫ్యానుకు ఉరేసుకున్న ఆనవాళ్లను నిశితంగా పరిశీలించారు. ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేశామని, సమగ్రంగా దర్యాప్తు చేస్తున్నామని సీఐ శ్రీనివాసరావు తెలిపారు.

అంతలోనే ఘోరం..

మొన్నటివరకు తమతో సరదాగా గడిపిందని, ఈనెల 1న విజయనగరం బయలుదేరి వచ్చిందని, అంతలోనే ఘోరం జరిగిందంటూ తల్లి కృష్ణవేణి కన్నీరుమున్నీరైంది. తండ్రి శాంతారావు కూడా కుమార్తె మృతిని జీర్ణించుకోలేకపోతున్నాడు. స్వాతి ఆ ఇంటికి పెద్దకుమార్తె. ఉన్నత చదువులు చదివించాలని ఆ కుటుంబం ఎంతో ఆశపడింది. ఇంతలోనే కుమార్తె చనిపోవడం జీర్ణించుకోలేకపోతున్నామని తల్లిదండ్రులు వాపోయారు. తమకుమార్తెకు ఎలాంటి ఆరోగ్య సమస్యలు లేవని, నాలుగు రోజుల క్రితమే ఇంటికి వచ్చిందని చెబుతున్నారు. ఏమి జరిగిందో. ఏమో కాని కూతురును దేవుడు తీసుకుపోయాడని కన్నీటి పర్యంతమయ్యారు.

దారి మారలేదు.. బాధ తీరలేదు!

(ఐదో పేజీ తరువాయి)

ఈఎన్‌సీ శ్రీనివాసరావు కొన్నాళ్ల కిందట ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఇంజనీరింగ్‌శాఖలో ఈఈల మధ్య వివాదం కొనసాగుతోంది. ఇటీవల పాతప ట్నం సెక్షన్‌లో పనిచేసిన ఇంజనీర్ అధికారి దీర్ఘకాలిక సెలవుపై వెళ్లారు. కాంట్రాక్టర్ చెబుతున్నట్టు వినడం లేదనే ఉద్దేశంతో.. ఆ అధికారిని బదిలీ చేయాలని ఒత్తిడి చేసినట్టు తెలుస్తోంది. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ఇంజనీరింగ్ శాఖపై దృష్టి సారించాల్సి ఉంది. గిరిజన ప్రాంతాల్లో రహదారుల పనులు పూర్తిచేసేలా చర్యలు చేపట్టాలని గిరిజనులు కోరుతున్నారు.

సందడిగా గ్రిగ్స్ పోటీలు

- ముగిసిన నియోజకవర్గ స్థాయి క్రీడలు


జావెలిన్‌త్రోలో పోటీ పడుతున్న విద్యార్థి

నందిగాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): లఖిదాసుపురం ఉన్నతపాఠశాల వేదికగా నిర్వ హించిన టెక్కలి నియోజకవర్గ స్థాయి గ్రిగ్స్ పోటీలు గురు వారం సందడి గా ముగిశాయి. మూడురోజుల పాటు ఈ పోటీలు జరిగాయి. చివరిరోజు అథ్లెటిక్స్‌కు సంబంధించి జావెలిన్‌త్రో, హైజంప్, లాంగ్‌జంప్, షార్ట్‌పుట్ తది తర పోటీలు నిర్వహించారు. టెక్కలి, నందిగాం, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల పరిధిలోని పలు పాఠశాలల నుంచి సుమారు 400మంది పోటీల్లో పాలుపంచుకున్నారు. విజేతలకు హెచ్ఎం చిలుకు కృష్ణారావు ఆధ్వర్యంలో బహుమతులు అంద జేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు ఎం.లోక నాథం, బి.మోహనరావు, ఎస్ఎంసీ చైర్మన్ సీహెచ్ సీతారాం, నియోజకవర్గ క్రీడల ఇన్‌చార్జి ఎన్.రమేష్, జోనల్ ఇన్‌చార్జి కె.ప్రకాష్, మండ ఇన్‌చార్జ్ జి.శ్రీనివాసరావు, నాలుగు మండలాలకు చెందిన పీఈటీలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాలీబాల్‌లో శిక్షణ..

నరసన్నపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్కూల్ గేమ్స్‌లో రాష్ట్రస్థాయిలో జరగనున్న వాలీబాల్ క్రీడాకారులకు ప్రత్యేక శిక్షణ గురువారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రారంభించారు. ఈ నెల 11 నుంచి మూడు రోజుల పాటు నెల్లూరు జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో అండర్ -14 విభాగం నుంచి పోటీపడనున్నట్టు పీడీ రమణమూర్తి అన్నారు. ఈ శిబిరాన్ని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ముఖ్యసలహాదారులు పి.సుందరరావు, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, వాలీబాల్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు వై.పోలినాయుడు, ఎంఈవో దాలినాయుడు, హెచ్ఎం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వ్యసనాలకు బానిసై.. దొంగలుగా మారి

(ఐదో పేజీ తరువాయి)

చెందిన ఎర్రబెల్లి అశోక్, గార మండలం బలరాంపురానికి చెందిన చోడిపల్లి వంశీ, పాలకొండ మండలం తోటవాడకు చెందిన బెండి శివ ప్రసాద్ గతంలో ద్విచక్ర వాహనాల దొంగతనాల కేసులో పట్టుబడి 45 రోజులపాటు జైలు శిక్ష అనుభవించారు. కొన్నాళ్ల తర్వాత బెయిల్‌పై బయటకు వచ్చిన ఆ ముగ్గురు యువకులు చెడు వ్యసనాలకు అలవాటుపడి రాత్రివేళల్లో ఆలయాల్లో కూడా చోరీలకు పాల్పడ్డారు. ఇటీవల శ్రీకాకుళం మండలంలోని మూడు ఆలయాల్లో, గార మండలంలో మూడు ఆలయాల్లో, శ్రీకాకుళం నగరం, నందిగాం ప్రాంతాల్లో ఒక్కో ఆలయాల్లో వెండి, ఇత్తడి వస్తువులు చోరీ చేశారు. కాగా.. బుధవారం ఆ ముగ్గురూ పాత్రునివలస వద్ద ద్విచక్ర వాహనంపై అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో రూరల్ ఎస్ఐ రాము వారిని అదుపులోకి తీసుకుని విచారణ చేశారు. వారు 8 ఆలయాల్లో దొంగతనాలకు పాల్పడినట్టు విచారణలో తేలింది. ఆ ముగ్గురిని అరెస్టు చేసి.. వారి నుంచి సుమారు రూ.1.71 లక్షల విలువైన వెండి, ఇత్తడి వస్తువులను రికవరీ చేశామని డీఎస్పీ వివేకానంద తెలిపారు. సమావేశంలో శ్రీకాకుళం రూరల్ సీఐ పైడిపు నాయుడు, ఎస్ఐ రాము పాల్గొన్నారు.

గొర్రెలమందపై మళ్లీ కుక్కల దాడి

(ఐదో పేజీ తరువాయి)

చెందిన గొర్రెల మందపై కుక్కలు దాడి చేయగా.. 42 గొర్రెలు మృతి చెందిన విషయం తెలిసిందే. తాజాగా గురువారం మరోసారి గొర్రెల మందపై కుక్కలు దాడి చేశాయి. ఈ ఘటనలో పల్ల సింహాచలానికి చెందిన ఐదు మేకలు మృతి చెందాయి. 12 మేకలకు తీవ్ర గాయాలయ్యాయి. మేకల మందలోకి పదుల సంఖ్యలో కుక్కలు చొరబడి దాడి చేశాయని సింహాచలం కన్నీటిపర్యంతమయ్యారు. కుక్కలు దాడులు చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మనుషులపై దాడి చేస్తే ప్రాణాలు కోల్పోతే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. కుక్కల నియంత్రణకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

7న జవహర్ నవోదయ నమూనా పరీక్ష

● ఎర్రన్న విద్యా సంకల్పం ఆధ్వర్యంలో ఐదు కేంద్రాల్లో నిర్వహణ

పాత శ్రీకాకుళం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ఎర్రన్న విద్యా సంకల్పం సంస్థ ఆధ్వర్యంలో కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు నేతృత్వంలో జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశాలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు నమూన పరీక్షను ఈనెల ఏడోతేదీన నిర్వహించేందుకు నిర్వాహకులు గురువారం షెడ్యూల్‌ను ఒకప్రకటనలో విడుదల చేశారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ నియోజకవర్గాలకు సమీప ప్రాంతాల్లో ప్రధాన పరీక్ష విధానంలో ప్రశ్నపత్రం, సమయం పాలనలో పరీక్షజరగనుందని తెలిపారు. దీనికోసం ముందుగా విద్యార్థులు వారి వివరాలతో నమోదు చేసుకోవాలని, రిజిస్టర్ చేసుకున్న విద్యార్థులు వెబ్‌సైట్ నుంచి హాల్ టికెట్ పొంది కేటాయించిన పరీక్ష కేంద్రాల్లో ఏడోతేదీ ఉదయం 11గంటలకు హాజరుకావాలని కోరారు. శ్రీకాకుళం గొంటివీధిలో గల విద్యాదరి కళాశాల, పాతపట్నం కోర్టు దగ్గరగల మహేంద్ర జూనియర్ కళాశాల, పలాస ఆర్టీసీకాంప్లెక్స్ వెనుక శివాజీనగర్ మదర్‌థెరిస్సా విద్యాలయం, టెక్కలిలో శ్రీవిశ్వజ్యోతి డిగ్రీ కళాశాల, సోంపేట పాత ఎస్బీఐ వీధిలో వీవీకే శిశు మందిర్ హైస్కూల్ పరీక్షకేంద్రాల ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

50 కేంద్రాల్లో ఎన్‌టీఎస్‌ఈ: డీఈవో

గుజరాతీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):జిల్లాలోని మూడు డివిజన్ ప్రధాన కేంద్రాల్లో 50 పరీక్ష కేంద్రాల్లో జాతీయ ఉపకార వేతన ప్రతిభా పరీక్షను (ఎన్‌టీఎస్‌ఈ) నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎ.రవిబాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2025-26 విద్యాసంవత్సరానికి గాను ఈనెల ఏడోతేదీన నిర్వహించనున్న ఈ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు. శ్రీకాకుళం డివిజన్‌లో 11, టెక్కలిలో ఆరు, పలాస డివిజన్‌లో ఎనిమిది కేంద్రాల్లో నిర్వహించే పరీక్షకు 5,627 మంది విద్యార్థులు హాజరవుతారని పేర్కొన్నారు. ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు జరిగే పరీక్షకు విద్యార్థులు ఉదయం 9.30 గంటలకే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. హాల్‌టికెట్లను ప్రభుత్వ వెబ్‌సైట్‌లోని స్కూల్ లాగిన్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. విద్యార్థుల ప్రవేశ పత్రంపై క్యూఆర్‌కోడ్‌ను స్కాన్ చేసి పరీక్ష కేంద్రం చిరునామా తెలుసుకోవచ్చని పేర్కొన్నారు.

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

● ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

రణస్థలం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని, రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పనిచేస్తోందని ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తెలిపారు. గురువారం సంచాంగ్రామంలో ధాన్యంకొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అన్నదాతసుఖీభవ పథకం కింద ప్రతి రైతుకూ రూ.14 వేలు అందజేసినట్లు తెలిపారు. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల వ్యవధిలోనే నేరుగా వారి బ్యాంకుల ఖాతాకు నగదు జమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో పైడిభీమవరం పీఏసీఎస్ ఛైర్‌పర్సన్ దంతులూరిసుశీలవర్మ, భానోజీరావు, జోగురాజు మౌళిశ్రీహరి, రమణ, వై.అప్పారావు పాల్గొన్నారు.

11 ధాన్యం సేకరణ కేంద్రాల ఏర్పాటు

సోంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దార్ బి.అప్పలస్వామి తెలిపారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ రైతు భరోసాకేంద్రాల్లో తేమశాతం పరీక్షించి 17 శాతం ఉంటే కోరిన మిల్లుకు ట్రక్‌షీటు ఇస్తారని తెలిపారు. మండలంలో పీఏసీఎస్‌ల ద్వారా ఆరు కేంద్రాలు,మర్లపోలమ్మఆర్బీఎఫ్‌పీవో ఆధ్వర్యంలో మూడు కేంద్రాలు, డీసీఎంఎస్ రెండు కేంద్రాలు నిర్వహిస్తోందని చెప్పారు. ఈకేంద్రాలద్వారా క్వింటా రూ.2,639కి కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. సమావేశంలో ఏవో బి.నరసింహమూర్తి, సీఎస్‌డీటీ రాము, పీఏసీఎస్ సీఈవో బీ.నారాయణరావు, డీసీఎంఎస్ రాజేష్ పాల్గొన్నారు.

పెండింగ్ డీఏలు మంజూరు చేయండి

గుజరాతీపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు రావల్సిన మూడుపెండింగ్ డీఏలను వెంటనే మంజూరు చేయాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్.మల్లేసు. పి.గోవిందరాజులు ఒక ప్రకటనలో డిమాండ్‌చేశారు. 12వ పీఆర్సీ ఏర్పాటు చేసి 30 శాతం మధ్యంతర భృతి ప్రకటించాలని కోరారు. 12వ పీఆర్సీ 2023 నుంచి అమలు కావల్సి ఉండగా నేటికీ కమిషన్ నియమించకపోవడంతో ఉద్యోగ,ఉపాధ్యాయల వర్గాల్లో తీవ్ర అసంతృప్తి నెలకొందని తెలిపారు.

పవర్ లిఫ్టింగ్‌లో బీటెక్ విద్యార్థికి బంగారు పతకం

సోంపేటరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎర్రముక్కాం గ్రామానికి చెందిన పొట్టి సాయి అనిరుధ్ పవర్‌లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్‌పోటీల్లో బంగారు పతకం సాధించాడు. ఫస్ట్ ఓపెన్ విశాఖ జూనియర్స్, సీనియర్స్ అండ్ మాస్టర్స్, బెంచ్ ప్రెస్‌అండ్ డెడ్ లిఫ్ట్ పోటీలను విశాఖ జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వేలంపేటలో జరిగాయి. ఈమేరకు విశాఖలో బిటెక్ చదువుతున్న సాయి పవర్ లిఫ్టింగ్‌లో ప్రతిభచూపాడు. హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేసిన సాయి తండ్రి జగదీష్ కొద్దినెలల కిందట రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం విదితమే. కాగా సాయికి గీతం స్పోర్ట్స్ డైరెక్టర్ అరుణ్‌కార్తీక్, వైజాగ్ వాడబలిజి, సంక్షేమ సంఘం అధ్యక్షుడు హరికృష్ణ, ఎర్రముక్కాం గ్రామస్థులు అభినందించారు.

ఇచ్ఛాపురం విద్యార్థికి తైక్వాండోలో కాంస్యం

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆశి రేవంత్ రెడ్డి అరుణాచల్ ప్రదేశ్‌లో జరిగిన 69వ జాతీయస్థాయి తైక్వాండో పోటీల్లో కాంస్య పతకం సాధించాడు. ఈ మేరకు గురువారం పాఠశాలలో మునిసిపల్ ఛైర్‌పర్సన్ పిలక రాజ్యలక్ష్మి, హెచ్‌ఎంతో సూర్యరావు రేవంత్ రెడ్డికి అభినందించారు.

ఎలియన్స్ క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపురంలోని ప్రభుత్వోన్నత పాఠశాల ఆవరణలో ఎలియన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక గురువారం మాజీ అధ్యక్షుడు లోపింటి నరసింహమూర్తి అధ్యక్షతన ఎన్నిక జరిగింది. క్లబ్‌అధ్యక్షుడిగా గవలాపు ఉమాశంకర్, కార్యదర్శిగా లాభాల వెంకట రమణ, ఉపాధ్యక్షుడిగా చాట్ల లోహిదాస్‌రెడ్డి, ఉప కార్యదర్శిగా ఆశి రవి, కోశాధికారిగా పి.డిల్లీ, ఉపకోశాధికారిగా పి.లెహిదాస్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు యోగి, కె.నరసిహమూర్తి, ప్రకాష్, సత్తమయ్య, వెంకటరమణ పాల్గొన్నారు.

పలాసను జిల్లాగా ప్రకటించాలి

పలాస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పలాసను జిల్లాగా ప్రకటించాలని పలు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాత్రి స్థానిక ఎస్‌ఎఫ్‌ఎస్ స్కూల్ రోడ్డులో అభిప్రాయసేకరణ కార్యక్రమాన్ని పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు, వివిధ ప్రజాసంఘాల గౌరవాధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ టెక్కలి, పలాస, పాతపట్నం, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని మండలాలను పలాసలో చేర్చి జిల్లాగా ప్రకటిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్నారు. దువ్వాడ శ్రీధర్ మాట్లాడుతూ పలాస జిల్లాసాధనకు పోరాటం చేస్తామని, ప్రజల మద్దతుఉందనితెలిపారు.త్వరలో సాధనకమిటీ నియమించి కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు.కార్యక్రమంలో కాంగ్రెస్, వైసీపీ, బీజేపీ,వామపక్ష పార్టీల నాయకులుడాక్టర్ దువ్వాడ జీవితేశ్వరరావు, వరిశహరిప్రసాద్, పాలవలస వైకుంఠరావు, వంకలమాధవరావు, రామారావు, ప్రజాకళాకారుడు కుత్తుమ వినోద్‌కుమార్, ఎన్‌జీవో బోనెలగోపాల్, న్యాయవాది బి.కామేశ్వ రరావుపట్నాయక్, కళాకారుడు కుమార్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.



సంఘీభావం ప్రకటిస్తున్న వివిధ సంఘాల నాయకులు

మరమ్మతులు లేక.. విస్తరణకు నోచుకోక

● అడుగడుగునా గోతులమయం ● 50 గ్రామాల ప్రజలకు తప్పని అగచాట్లు ●ఇదీ పూండి రోడ్డు పరిస్థితి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పూండి రోడ్డు అధ్వానంగా మారడంతో రాకపోకలకు వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. ఏళ్లతరబడి మరమ్మతులకు నోచుకోవడంలేదు. విస్తరణకు ప్రభుత్వానికి చేస్తున్న ప్రతిపాదనలు అటకెక్కుతున్నాయి. ఈనేపథ్యంలో అడుగడుగునా గోతులమయంకావడంతో 50 గ్రామాల ప్రజలు అగచాట్లకు గురవుతున్నారు.ఈమార్గంలోచీకటిపడిన తర్వాత ప్రయాణమంటే హడలిపోతున్నారు.

పూండి ఇప్పుడిప్పుడే వాణిజ్యకేంద్రం అభివృద్ధి చెందుతోంది. ఇక్కడ సింగిల్‌లైన్ రోడ్డు కావడంతో పాటు రోడ్డంతా గోతులమయంకావడంతో నిత్యం ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈరోడ్డు మీదుగా 50 గ్రామాలు రాకపోకలు సాగిస్తుంటారు.చుట్టుపక్కల గ్రామాల నుంచి కొబ్బరి తదితర ఉత్పత్తులు పూండిలోని మార్కెట్‌కు తీసుకు వస్తుంటారు. అయితే దశాబ్దాలుగా సింగిల్ రోడ్డుకావడం, మరమ్మతులు లేకపోవడంతోపాటు వాహనాల రద్దీ వల్ల అధ్వానంగా మారింది. ఈనేపథ్యంలో వెంకటాపురం నుంచి పూండి మీదుగా నౌపాడ వరకు రోడ్డు విస్తరణకు ప్రతిపాదనలు పంపించినా ప్రభుత్వం అనుమతి లభించలేదు. వైసీపీ హయాంలో పూండి రోడ్డు నిర్మాణంకోసం హడావుడిచేసినా పనులుచేపట్టలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. పూండి రోడ్డు పనులు చేపట్టాలని వజ్రపుకొత్తూరు మండల సమావేశంలో పలుమార్లు ప్రశ్నించినా ఫలితం లేకుండాపోయిందని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు చెబుతున్నారు. కాగా కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత నరసన్నపేట నుంచి కోటబొమ్మాళి, సంతబొమ్మాళి మండలాలను కలుపుతూ పూండి మీదుగా బెండిగేటు వరకు రెండు లైన్లు విస్తరణ పనులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.100 కోట్లతో పనులు చేపట్టేందుకు ప్రతిపాదనలు జరిగినట్లు ఆర్‌అండ్‌బీ ఏఈఈ జగదీష్ చెప్పారు. ఇప్పటికే కేంద్రప్రభుత్వం జీవో విడుదల చేసిందని, రాష్ట్ర ప్రభుత్వం జీవో విడుదల చేసిన వెంటనే టెండరు ప్రక్రియ పూర్తిచేసి రోడ్డు పనులు చేపడతామని తెలిపారు.



అధ్వానంగా ఉన్న పూండి రోడ్డు

మంత్రి లోకేశ్‌కు ఘన స్వాగతం

● జిల్లా మీదుగా భామిని పర్యటనకు పయనం



రణస్థలం: పైడిభీమవరం వద్ద మంత్రి లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు

జిల్లాలోని రణస్థలం, ఆమదాలవలస, కొత్తూరు తదితర ప్రాంతాల్లో విద్యాశాఖ మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారాలోకేశ్‌కు టీడీపీ కార్యకర్తలు గురువారం ఘనస్వాగతం పలికారు. శుక్రవారం పార్వతీపురం మన్యం జిల్లాలోని భామిని ప్రభుత్వ ఆదర్శ జూనియర్ కాలేజీలో జరిగే మెగా పేరెంట్‌టీచర్స్‌మీటింగ్‌లో సీఎం చంద్రబాబుతో కలిసి పాల్గొనున్నారు.

●శ్రీకాకుళం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ప్రజాప్రతినిధులు విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. గురువారం రాత్రి శ్రీకాకుళం జిల్లా మీదుగా పార్వతీపురం మన్యం జిల్లాకు మంత్రి లోకేష్ వెళ్లారు. దీంతో రణస్థలం నుంచి పాతపట్నం వరకు అన్ని నియోజకవర్గ టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు మంత్రికి స్వాగతం పలికారు. ఎచ్చెర్ల, శ్రీకాకుళం, పాతపట్నం ఎమ్మెల్యేలు నడుకుదిటి ఈశ్వరరావు, గొండు శంకర్, మామిడి గోవిందరావు భారీసంఖ్యలో కార్యకర్తలు, అనుచరులతో కలిసి మంత్రికి స్వాగతం పలకడానికి వెళ్లారు. వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు భామిని వెళ్లి అక్కడ మంత్రి లోకేష్‌కు స్వాగతం పలికారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడి పర్యటన ఏర్పాట్లను మంత్రి అచ్చెన్న పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు.

●రణస్థలం, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పైడిభీమవరంలో ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీతో పాటు కూటమి నేతలు డీజీఎం ఆనందరావు, బెండు మల్లేశ్వరరావు, పిన్నింటి భానోజీనాయుడు, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, లంక ప్రభ, బాలి శ్రీను, దన్నాన మహేష్ తదితరులు లోకేశ్‌కు ఘన స్వాగతం పలికారు. భామినిలో శుక్రవారం జరిగే కార్యక్రమంలో పాల్గొనేందుకు విశాఖ విమానాశ్రయంలో దిగిన లోకేష్ జిల్లా మీదుగా రోడ్డు మార్గం గుండా పాలకొండ వెళ్లారు. భామినిలో గురువారం రాత్రి బస చేయనున్న లోకేష్ టీడీపీ నేతలతో సమావేశమవుతారు.

●ఆమదాలవలస: ఆమదాలవలసలోని ఫ్లైఓవర్ వద్దగల ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద నియోజకవర్గం లోని టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు లోకేశ్‌కు ఘనస్వాగతం పలికారు.శ్రీకాకుళం నుంచి పాలకొండ మీదుగా భామిని వెళ్లే క్రమంలో లోకేష్ పట్టణంలోని ఎన్‌టీఆర్ విగ్రహం వద్ద వేచిఉన్న ప్రజలను చూసి కాన్వాయ్‌ను ఆపారు. ఆ సమయంలో టీడీపీనాయకులు మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మొదలవలస రమేష్, తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, సనపల డిల్లీశ్వరరావు పూలబొకేలతో స్వాగతం పలకగా ఎమ్మెల్యే రవికుమార్ సతీమణి, మాజీ ఎంపీపీ కూనల ప్రమీల, మునిసిపల్ మాజీ ఛైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్ హారతులిచ్చారు. ఈ సందర్భంగా కొందరు పలుసమస్యలపై అర్జీలు ఇవ్వగా పరిశీలించి సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తానని లోకేష్ తెలియజేస్తూ కాన్వాయ్ ముందుకు సాగింది.



ఆమదాలవలస: మంత్రి లోకేశ్‌కు హారతి ఇస్తున్న తెలుగు మహిళలు

● శ్రీకాకుళం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం హైవే వద్ద కొత్తరోడ్డు -రాగోలు జంక్షన్‌లో మంత్రి నారా లోకేశ్‌కు టీడీపీ శ్రేణులు స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో స్వాగతం పలికాయి. ఈ సందర్భం గా పలువురు పార్టీ నాయకులు వినతిపత్రాలు అందజేశారు. లోకేష్, శంకర్‌తో మాట్లాడారు.



శ్రీకాకుళం రూరల్: లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న గొండు శంకర్



మొదటి మెట్టు వద్ద కొబ్బరి కాయలు కొడుతున్న దృశ్యం



కొండపై పూజల కోసం బారులు తీరిన భక్తులు

భక్తిశ్రద్ధలతో పీర్లకొండ యాత్ర

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి):ఇచ్ఛాపురంలో గురువారం పీర్లకొండ యాత్ర భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా మూడోవారం ఒడిశాలోని భువనేశ్వర్ తదితర ప్రాంతాలు, విశాఖ, హైదరాబాద్, జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చారు. ఇక్కడ ఏటా మార్గశిరమాసం గురువారాల్లో కొండపై కులమతాలకు అతీతంగా పూజలు నిర్వహిస్తుంటారు. హిందువులు పూజా సామగ్రిని తీసుకువెళ్తే అక్కడ ముస్లిములు వాటిని భగవంతునికి నివేదిస్తారు. ఈ సందర్భంగా పీర్లకొండ మొదటి మెట్టుపై భక్తులు కొబ్బరి కాయలు కొట్టి దీపారాధన చేశారు. అనంతరం కొండపైకి వెళ్లి పూజలు జరిపారు. కొండపై గల కంధకం నీటిని తీసుకొనేందుకు భక్తులు పోటీ పడ్డారు.

విద్యను నిర్లక్ష్యం చేయరాదు: కలెక్టర్

పాత శ్రీకాకుళం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): విద్యను నిర్లక్ష్యం చేయరాదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కోరారు. గురువారం శ్రీకాకుళం రిమ్స్ గవర్నమెంట్ మెడికల్ కాలేజీలో ఫెస్ట్ సంగ్యాన్ వార్షిక సంబరాలు ముగిశాయి. ఈ సందర్భంగా నిర్వహించిన వేడుకల్లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ఇటువంటి భారీ స్థాయిలో వేడుకలు నిర్వహించాలంటే టీమ్ వర్క్‌తో సాధ్యమని తెలిపారు. అనంతరం కలెక్టర్ చేతుల మీదుగా క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేశారు.సంగ్యాన్ నాలుగురోజులు కార్యక్రమాల్లో భాగంగాసాయంత్రం వైద్యులు నిర్వహించిన ఫ్యాషన్ షో, నృత్యాలు, గీతాలాపనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో వైజాగ్ నెఫ్రాలజిస్ట్ టి. రవిరాజు, ప్రిన్సిపాల్ ఎస్.అప్పలనాయుడు, వైస్ ప్రిన్సిపాళ్లు కె. సునీల్ నాయక్,రాము, ఆర్గనైజింగ్ సభ్యులు కె .భాస్కరరావు, అచ్యుతరావు, చిన్న పిల్లలు వైద్యులు హరీష్, జ్యోస్న, పి.కారణ్, సిబ్బంది పీజీ, యూజీ విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులు ప్రదానంచేస్తున్న కలెక్టర్

స్థలాలు లేక.. పార్కింగ్‌కు బేజారు

● జంట పట్టణాల్లో నిత్యం స్తంభించిపోతున్నట్రాఫిక్



కేటీ రోడ్డులో డివైడర్ మధ్యలో పార్కింగ్ ఏర్పాటుచేసిన దృశ్యం

కాశీబుగ్గ, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ జంట పట్టణాల్లో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. స్థలాలు లేకపోవడంతో పార్కింగ్‌కు అగచాట్లు తప్పడం లేదు. వాహనాల సంఖ్యతోపాటు జనాభా పెరిగినారోడ్లు విస్తరించడంలేదు. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా రోడ్లు లేకపోవడంతో రద్దీ పెరిగితే ట్రాఫిక్ స్తంభించిపోతోంది.

జంటపట్టణాలు వాణిజ్యపరంగా విస్తరిస్తున్నాయి. కానీ అందుకు తగ్గట్టుగా వసతులు మాత్రం సమకూరడంలేదు. ప్రధానంగాపార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనచోదకులు అవస్థలుపడుతున్నారు. ఈనేపథ్యంలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు జీటీ రోడ్డులో రోడ్డులో సెంట్రర్ పార్కింగ్ ఏర్పాటుచేశారు. ఈ మార్గంలో ప్రధానంగా మూడు రోడ్ల జంక్షన్, రైల్వేగేటు, ఆర్టీసీ కాంప్లెక్స్, ఇందిరా చౌక్‌ల వద్ద వాణిజ్య సముదాయాలు, హోటళ్లు, ఆస్పత్రులు, లాడ్జీలు, కళ్యాణమండపాలు ఎక్కువగా ఉన్నాయి.చాలాచోట్ల సెట్ బ్యాక్, పార్కింగ్, రిజర్వ్ స్థలాలు లేవు. ఆపై పశువుల సంచారం అధికంగా ఉండడంతో జంట పట్టణాలు అంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు.

ఇదీ పరిస్థితి..

పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీలో 64 వేలు జనాభా నివసిస్తున్నారు. అనధికారికంగా లక్షవరకూ ఉండే అవకాశముంది. రోజుకు సగటున జంట పట్టణాల్లోకి మూడు నుంచి నాలుగు వేల వరకూ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. దాదాపు 30 వరకూ వాణిజ్య సముదాయాలు ఉన్నాయి. దీంతో వాహనాల తాకిడి అధికంగా ఉంటోంది.కానీ పార్కింగ్ స్థలాలు కేవలం నాలుగు మాత్రమే ఉన్నాయి. దీంతో వాహనచోదకులు జీటీ రోడ్డు మధ్యలో, పాత బస్టాండ్ ప్రాంగణంలో, సంతప్రాంగణంలో వాహనాలను పార్కింగ్‌చేయాల్సివస్తోంది. వాణిజ్య సముదాయాల ఎదుట అడ్డదిడ్డంగా వాహనాలు నిలుపుతుండడంతో రాకపోకలకు ఇబ్బందికరంగా మారుతోంది. ప్రతిశుక్రవారం వారపు సంత జరుగుతోంది. ఆ సమయంలో వాహనాలను అడ్డదిడ్డంగా నిలుపుతుండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి.

ప్రజల సమస్యలు పరిష్కరించాలి

పాత శ్రీకాకుళం, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికను పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహ్మఖాన్, ట్రైనీ కలెక్టర్ పృధ్వీరాజ్ రాజ్‌కుమార్ తోపాటుఉన్నతాధికారులతో కాన్ఫరెన్స్ నిర్వహించారు.ఈ సందర్భంగా పీఎం-కుసుమ్ పథకం, భూవివాదాలు, ఎరువులు సరఫరా లోపాలు, పెండింగ్ పించన్లపై చర్చించారు. సీజనల్ వ్యాధుల నియంత్రణ, ధాన్యం సేకరణలో జాప్యం లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

దేవీ ఆశ్రమంలో పౌర్ణమి పూజలు

ఎచ్చెర్ల, డిసెంబరు4(ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచాలకురమయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో మార్గశిర మాస పౌర్ణమి పూజలు గురువారం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ ఆధ్వర్యంలో శ్రీ చక్రాల వద్ద భక్తులు కుంకుమపూజలు చేశారు. అలాగే రాజరాజేశ్వరి దేవీకి ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు.

●కంచిలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కంచిలిలోని మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర గురువారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.



ఎచ్చెర్ల: దేవీ ఆశ్రమంలో శ్రీచక్రాల వద్ద భక్తులతో కుంకుమ పూజలు చేయిస్తున్న పీఠాధిపతి తేజోమూర్తుల బాలభాస్కరశర్మ

రిటైర్డ్ ఏఎంవీఐ వెంకటరావుకు ప్రొవిజినల్ పెన్షన్ మంజూరు

శ్రీకాకుళం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లా ఉపరవాణా కమిషనర్ (డీటీసీ) కార్యాలయంలో అసిస్టెంట్ మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్(ఏఎంవీఐ)గా పనిచేసి రిటైరైన ఎస్.వెంకటరావుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రొవిజినల్ పెన్షన్‌ను మంజూరు చేసింది. ఈ మేరకు రోడ్లు భవనాలశాఖ ప్రత్యేక కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు గురువారం ఉత్తర్వులను జారీచేశారు. వెంకటరావు 2024 జూలై 31న ఉద్యోగ విరమణ చేశారు. అయితే ఆయనపై ఏసీబీ కేసులుపెండింగ్‌లో ఉండడంతో సాధారణ పెన్షన్‌కు పూర్తిగా అనుమతి ఇవ్వలేదు. నిబంధనల ప్రకారం ఆయనకు అర్హత ఉన్న సాధారణపెన్షన్ రూ.43,264 కాగా.. అందులో 75 శాతాన్ని(రూ. 32,448) మాత్రమే ప్రొవిజనల్ పెన్షన్‌గా మంజూరుచేశారు. ఆయనపై ఉన్న క్రమశిక్షణచర్యలు, ఏసీబీ కేసులు పూర్తయ్యే వరకు డెత్ కమ్ రిటైర్మెంట్ గ్రాట్యుటీ మొత్తాన్ని పూర్తిగా ప్రభుత్వం నిలిపివేసింది. ఈ పెన్షన్ చెల్లింపులు 2024 ఆగస్టు 1 నుంచి అమల్లోకి వస్తాయి.ఉత్తర్వుల్లో ఆయనపై పెం డింగ్‌లోఉన్న ఏసీబీకేసుల తుది తీర్పునకు లోబడిఉంటాయని ప్రభుత్వం స్పష్టంచేసింది.

నేడు ఆర్వో ప్లాంట్ ప్రారంభం

ఇచ్ఛాపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పురుషోత్తపురం ఏపీ మోడల్ స్కూల్‌లో ఏర్పాటు చేసిన ఆర్వో ప్లాంట్‌ను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించనున్నారని టీడీపీ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు పత్రి తవిటయ్య, నందిగాం కోటి ప్రకటనలో తెలిపారు. పట్టణానికి చెందిన వ్యాపారవేత్త పైడిశెట్టి దినేష్‌కుమార్ తన సొంత నిధులతో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

డైవర్షన్ రోడ్డు ఏర్పాటు

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు4 (ఆంధ్రజ్యోతి):మండలంలోని రాగోలు రోడ్డు- క్రొత్త బ్రిడ్జి సమీపంలో ఆర్అండ్‌బీ అధికారులు డైవర్షన్ రోడ్డు ఏర్పాటుచేశారు. ఇక్కడ కల్వర్టు నిర్మాణానికి సంబంధించిన పనులు ప్రారంభం కావడంతో ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా పాత బ్రిడ్జికి సమాంతరంగా ప్రత్యామ్నాయ మార్గం ఏర్పాటు చేయాలని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ ఆర్అండ్‌బీ అధికారులకు కోరారు. దీంతో అధికారులు తక్షణమే డైవర్షన్ రోడ్డు నిర్మాణం పూర్తి చేశారు.

డ్రైనేజీ పనుల ప్రారంభం

జి.సిగడాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పాలఖండ్యాం కూడలిలో రూ.ఆరులక్షలతో చేపట్టే డ్రైనేజీ పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు రవికుమార్, పీఏసీఎస్ ఛైర్మన్ మురళి, కామోజులు సీతారాం పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీవోగా శాంతికుమారి

సోంపేట, డిసెంబరు 4 (ఆంధ్రజ్యోతి) : డిప్యూటీ ఎంపీడీవోగా బి.శాంతికుమారి గురువారం బాధ్యతలు చేపట్టారు. సోంపేట ఈవోగా పనిచేస్తున్న శాంతి డిప్యూటీ ఎంపీడీవోగా పదోన్నతి లభించింది. ఈమేరకు ఎంపీడీవో ఈశ్వరమ్మ, కార్యాలయ సిబ్బంది అభినందించారు.

ఇంటికి చేరేలోపే..

● అనారోగ్యంతో వ్యక్తి మృతి


మృతి చెందిన నరేంద్ర

పాతపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మరికాసేపట్లో తన ఇంటికి చేరుకుంటాడనుకున్న ఒడిశాకి చెందిన ఓ వ్యక్తి స్పృహతప్పి మృతి చెందిన ఘటన గురువారం పాతపట్నంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఒడిశా రాష్ట్రం గుసాని బ్లాక్ లింగుపురం గ్రామానికి చెందిన నరేంద్ర రెంగని(47) హైదరాబాద్ వలస వెళ్లి కూలి పనులు చేసుకుంటూ స్వగ్రామంలో ఉన్న తన కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. ఈ క్రమంలో నరేంద్ర అనారోగ్యానికి గురైయ్యాడు. ఎంతకీ ఆరోగ్యం కుదుట పడకపోవడంతో ఇంటికి వచ్చేయాలని భార్య పిల్లలు చెప్పారు. దీంతో హైదరాబాద్ నుంచి ఓ ట్రావెల్స్ బస్సులో గురువారం పాతపట్నం చేరుకున్నాడు. ఈ క్రమంలో అస్వస్థతకు గురైన నరేంద్ర.. రోడ్డు పక్కనే గల ఓ బెంచిపై కూర్చొని విద్యుత్ స్తంభాన్ని ఆనించి తల వాల్చాడు. అయితే ఎంతసేపైనా లేవకపోడంతో అక్కడివారు గుర్తించి పోలీసులకు సమాచారమిచ్చారు. సీఐ ఎస్.సన్యాసినాయుడు సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి, నరేంద్రను స్థానిక సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. బ్యాగ్‌లో ఉన్న వివరాలు ఆధారంగా నరేంద్ర కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. నరేంద్ర భార్య మాలతి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ ఎల్.అప్పారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అదృశ్యమైన వృద్ధుడు మృతి


ఆనంద పోరీడి (ఫైల్)

పాతపట్నం డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈనెల 2వ తేదీ నుంచి కనిపించకుండా పోయిన ఆనంద పోరీడి(69) గురువారం శవమై కనిపించాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చంగుడి గ్రామానికి చెందిన ఆనంద పోరీడి ఈనెల 2వతేదీ నుంచి కనిపించుటలేదని అతడి కుమారుడు సంతోష్ పోరీడి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నారు. కాగా మండలం సరాళి గ్రామ చేరువలో మహేంద్ర తనయ నదిలో శెగిడివీధి రేవు వద్ద గురువారం శవమై కనిపించాడు. చిన్నకుమారుడు సునీల్ పోరీడి గుర్తించి పోలీసులకు, కుటుంబ సభ్యులకు సమాచారం మిచ్చారు. కాగా ఆనంద పోరీడి ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ కె.శ్రీరామ్మూర్తి కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

లగేజీ వ్యాన్ ఢీకొని టైల్స్ మేస్త్రీ..

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): నగరంలో లగేజీ వ్యాన్ ఢీకొనడంతో గురువారం ఓ వ్యక్తి మృతి చెందాడు. ట్రాఫిక్ పోలీసుల కథనం మేరకు.. ఎచ్చెర్ల మండలం బొంతలకోడూరు గ్రామానికి చెందిన పంచిరెడ్డి శ్రీనివాసరావు (45) టైల్స్ మేస్త్రీగా పనిచేస్తున్నాడు. గురువారం మధ్యాహ్నం బొంతలకోడూరు తన ఇంటిలో భోజనం ముగించుకొని పని నిమిత్తం అరసవల్లి తన ద్విచక్రవాహనంలో బయలుదేరాడు. మిల్లు జంక్షన్ నుంచి అరసవల్లి దేవాలయానికి వెళ్లే రహదారిలో వెనుక నుంచి వచ్చి లగేజీ వ్యాన్ ఢీకొనడంతో శ్రీనివాసరావుకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల సమాచారం మేరకు 108 వాహనంలో చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

ఆటో ఢీకొనడంతో ఒకరు..

గార, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చల్లపేట రోడ్డు సమీపంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో అరసవల్లికి చెందిన సాధు రాజారావు (50) మృతి చెందాడు. ఎస్‌ఐ సీహెచ్ గంగరాజు కథనం మేరకు.. తాపీ పనిచేస్తూ జీవిస్తున్న రాజారావు ద్విచక్రవాహనంపై అరసవల్లి వెళ్తున్నాడు. ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించుకొని ముందుకు వెళ్తున్నాడు. అదే సమయంలో ఎదురుగా వస్తున్న ఆటో ఢీకొనడంతో రాజారావుకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. ద్విచక్రవాహనం వెనుక కూర్చొన్న ముడిదాన శ్రీను స్వల్పంగా గాయపడ్డాడు. శ్రీను ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మెరుగైన వైద్యంతో కోలుకున్న బాలుడు

కోటబొమ్మాళి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలానికి చెందిన తొమ్మిదేళ్ల వయసు గల ఓ బాలుడు ఆ గ్రామ చెరువులో పడిన స్పృహ కోల్పోయాడు. దీంతో చికిత్స కోసం శ్రీకాకుళంలో గల మెడికవర్ హాస్పటల్‌కు తరలించారు. స్పర్శ లేకుండా, హార్ట్‌బీట్ చాలా తక్కువగా ఉన్న ఆ బాలుడికి వైద్యులు కృత్రిమ శ్వాస అందించారు. ఊపిరితిత్తుల్లో పేరుకుపోయిన నీటిని బయటకు తీసి మెరుగైన వైద్యం అందించడంతో ఆ బాలుడు ప్రాణాలతో బయటపడ్డారు. చిన్న పిల్లల వైద్యులు మొదలవలస శ్రీరంగ ఆధ్వర్యంలో చికిత్స అందించారు.

కుళాయి తొలగింపుపై ఆందోళన


కుళాయి తొలగించిన చోట ఆందోళన చేస్తున్న దృశ్యం

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ మెయిన్‌రోడ్డులో గల లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో మత్స్యకారుల వీధిలో అలా వేసిన తాగునీటి కుళాయిని అధికారులు ఇలా తొలగించారు. దీంతో స్థానిక బీజేపీ నాయకులతో పాటు పలువురు కండ్రవీధి మహిళలు గురువారం ఆందోళన చేపట్టారు. తాము ఈ ప్రాంతానికి తాగునీటి సౌకర్యం లేదని ఎన్నాళ్ల నుంచో అధికారులను వేడుకుంటుండగా కుళాయి సౌకర్యం కల్పించిన అధికారులు స్థానిక నాయకుల ప్రలోబాలకు లోనై పైపులైన్లు తొలగించారని ఆరోపించారు. కుళాయి పైపులైన్‌ను వేసి తమ దాహార్తిని తీర్చాలని బీజేపీ స్వచ్ఛభారత్ జిల్లా కన్వీనర్ లింగరాజు, దవళ శ్రీధర్, జెనియా సత్యవతి, కుసుమ, పుష్పాంజలి, చూడామణి బెహరా, వివేకానంద, దామోదర్ బెహరాలు ఉన్నారు.

పోలీసుల తనిఖీలు



కోటబొమ్మాళి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లోని కిరాణా దుకా ణాలు, షాపు ల్లో నిషేధిత, మత్తుపదార్థాల కో సం పోలీసులు గురువారం ముమ్మరంగా తనిఖీ లు చేపట్టారు. నిమ్మాడ, నిమ్మాడ జంక్షన్, తిలారు రోడ్డు, జాతీయ రహదారిపై గల పలు దుకాణాల్లో డాగ్ స్క్వాడ్‌తో తనిఖీ చేపట్టారు. ఏఎస్‌ఐ శంకరరావు, తదితరులు ఉన్నారు.

గోవిందరాజులకు అభినందన

కోటబొమ్మాళి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): కళింగ వైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్ బోయిన గోవిందరాజులను పలువురు గురువారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు బోయిన రమేష్, కొత్తమ్మతల్లి ఆలయ ధర్మకర్తల మండలి ఛైర్మన్ కోరాడ గోవిందరావు, సభ్యులు మంచాల వెంకటరావు, ఆలయ ఈవో వాకచర్ల రాధాకృష్ణ, పీఏసీఎస్ డైరెక్టర్ ఎస్.రామ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మారుమూల గ్రామాల్లో రేషన్ దుకాణాలు

● ఎమ్మెల్యే గౌతు శిరీష


రేషన్ దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

హరిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో పేదల కోసం చౌకధరల దుకాణాలు ఏర్పాటు చేస్తు న్నట్టు ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. మందస మండలం బాలిగాం పంచాయ తీ వీరభద్ర గ్రామంలో నూతన చౌకధరల దుకాణాన్ని గురువారం ఆమె ప్రారంభిం చి మాట్లాడారు. ప్రస్తుతం రేషన్ దుకా ణాల ప్రతి రోజూ తెరిచి సూపర్ మార్కెట్ల వలే సరుకులు విక్రయించేలా ఏర్పా ట్లు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బావన దుర్యోధన, సాలిన మాధవరావు, లబ్బ రుద్రయ్య, తమిరి భాస్కరరావు, బమ్మిడి కర్రయ్య, మామిడి తాతారావు, గొర్లె హరీష్, నారయణ, నవీన్, బి.తారక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలి

పలాస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక చింతన కలిగి ఉండాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష కోరారు. శుక్రవారం దత్తజయంతి సందర్భంగా స్థానిక నెమలికొండ దత్తాశ్రమంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ప్రత్యేక పూజలు జరిపారు. దత్తాత్రేయ ఆలయంలో దత్తదర్శనం చేసుకున్న అనంతరం య జ్ఞకార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం దత్తపీఠాదిపతి సదానందస్వామి ఆశీసులు తీసుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అలాగే దత్తఆశ్రమం నుంచి నెమలినారాయణపురం గ్రామానికి రూ.11 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ బళ్ల గిరిబాబు, టీడీపీ నాయకులు లొడగల కామేశ్వరరావుయాదవ్, వజ్జ గంగాభవాని, మల్లా శ్రీనివాస్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, గురిటి సూర్యనారాయణ, ఎం.నరేంద్ర, దువ్వాడ శ్రీకాంత్, పీరుకట్ల విఠల్‌రావు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి అండగా ప్రభుత్వం

● ఎమ్మెల్యే గోవిందరావు


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆపదలో ఉండే ప్రతీకుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో హిరమండలం మండల గులుమూరు గ్రామానికి చెందిన మజ్జి భాగ్యలక్ష్మికి మంజూరైన రూ.1లక్ష సీఎంఆర్ఎఫ్ చెక్కును గురువారం ఎమ్మెల్యే అందజేశారు. భాగ్యలక్ష్మి భర్త బుజ్జి అనారోగ్యానికి గురై వైద్యసేవలు పొందుతూ ఇటీవలే మృతిచెందాడు. వైద్య సేవలకు అధిక మొత్తంలో వెచ్చించినా బజ్జి మృతి చెందాడు. దీంతో ఆర్థికంగా చితికి పోయిన ఆ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యేను ఆశ్రయించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ సహాయనిధికి దరఖాస్తు చేయించడంతో సాయం మంజూరైంది. కార్యక్రమంలో పలువురు కూటమి నేతలు పాల్గొన్నారు. ●

స్థానిక షిర్డీ గిరిపై సాయినాథ్ ధ్యాన మందిరంలో గురువారం నిర్వహించిన దత్తాత్రేయ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొని పూజలు చేసి, అన్నప్రసాదసేవలో పాల్గొన్నారు. ●

ఎంపీ ల్యాడ్స్ ద్వారా మెళియాపుట్టిలోని క్రీడామైదాన్ని అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు తెలిపారు. తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను మెళియాపుట్టి మండల నాయకులు, యువత మర్యాద పూర్వకంగా కలుసుకున్ని తమ ఇబ్బందులు వివరించారు. సామాజిక భవనం నిర్మించాలని పొందర కులస్థులు వేడుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు అనపాన రాజవేఖరరెడ్డి, యూత్ సభ్యులు నగేష్ శంకర్ డిల్లీ బృందావన్ మణి తదిరతులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా అంగన్‌వాడీ భవనాలు

జలుమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీ కేంద్రాలకు సరైన భవన సదుపాయాలు లేక కేంద్రాల్లో పిల్లలు అనేక అగచాట్లు పడుతున్నారు. భవన సదుపాయాలు లేక కొన్ని కేంద్రాలు అద్దె భవనాల్లోను, మరికొన్ని కేంద్రాలు పాఠశాలల్లోను నిర్వహిస్తున్నారు. అరకొర సదుపాయాలు, ఇరుకు గదుల్లో పిల్లలకు పోషణ అందిస్తూ అదే భవనంలోనే కేంద్రానికి వచ్చిన సరుకులు, వంటచేసే గ్యాస్‌స్టవ్‌లు ఉంచుకోవడం అంగనవాడీలకు ఇబ్బందిగా ఉంది. అయితే గత ప్రభుత్వం నాడు-నేడు కింద ఒక్కొక్క భవనం నిర్మాణానికి రూ.16 లక్షలు మంజూరు చేసింది. జలుమూరు మండలానికి సంబంధించి కొమనాపల్లి పంచాయతీ కత్తిరివానిపేటకు, వెంకటాపురం పంచాయతీకి సంబంధించి కృష్ణాపురంకు అంగనవాడీ భవనాలు మంజూరు చేసింది. ఆ భవనాలు పనులు ఇప్పటికీ అసంపూర్తిగానే ఉన్నాయి. అలాగే 2017లో గుగ్గిలి, హంస్సేనుపురంలో అంగనవాడీ భవనాలు నిర్మాణానికి అప్పటి ప్రభుత్వం ఒక్కొక్క భవనం నిర్మాణానికి రూ.7.50 లక్షలు మంజూరు చేసి పనులు ప్రారంభించారు. ఆ భవనాలు కూడా అసంపూర్తిగానే నిలచిపోయాయి. అలాగే సారవకోట మండలంలో అలుదు, సారవకోటలో అంగనవాడీ భవనాలు నిర్మాణానికి నాడు-నేడు కింద నిధులు మంజురయ్యాయి. అలుదు భవన నిర్మాణం స్థల సమస్య వలన నిలచిపోగా, సారవకోటలో భవన నిర్మాణం పనులు అసంపూర్తిగానే నిలచిపోయాయి. అలాగే 2017లో సవర శివరాంపురంలో భవనం నిర్మాణానికి 7.50 లక్షలు నిధులు మంజురయ్యాయి. ఆ భవనం పనులు అసంపూర్తిగానే నిలచిపోయాయి. దీంతో అంగనవాడీ కేంద్రాలకు సరైన భవన సదుపాయాలు లేక ఇరుకు గదుల్లోను అసంపూర్తి భవనాల్లోను కొనసాగుతున్నాయి. ఇప్పటికైనా సంబందిత అధికారులు స్పందించి అసంపూర్తిగా ఉన్న అంగనవాడీ భవనాలు పనులు పూర్తిచేసి ఆదుకోవాలని పలువురు కోరుతున్నారు. దీనిపై ఎంఈవో బి.మాధవరావు మాట్లాడుతూ.. బిల్లులు అందక పోవడంతో కాంట్రాక్టర్లు పనులు చేపట్టడం లేదన్నారు.


గుగ్గిలిలో పూర్తికాని అంగన్‌వాడీ భవనం


కత్తిరివానిపేటలో అంగన్‌వాడీ భవనం పరిస్థితి

రేపు మండల సమావేశం

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఎం.రేణుక గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండలపరిషత్ సమావేశ మందిరంలో ఆరోజు ఉదయం 10.30గంటలకు ఎంపీపీ అట్ల సరోజినమ్మ అధ్యక్షతన జరుగుతుందని, ఈ సమావేశానికి సభ్యులు, సర్పంచ్‌లతో పాటు అధికారులు పూర్తి సమాచారతో హాజరవ్వాలని కోరారు.

ధాన్యం కొనుగోలులో న్యాయం చేయాలి


తహసీల్దార్‌కి వినతిపత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

నందిగాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ధాన్యం కొనుగోలులో ఎదురవుతున్న ఇబ్బందులను అధిగమించి రైతులకు న్యాయం చేయాలని బీజేపీ, తూర్పుకాపు సంఘ ప్రతినిధులు తహసీల్దార్ పి.సోమేశ్వరరావును కోరారు. ఈ మేరకు గురువారం బీజేపీ ఆధ్వర్యంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అట్టాడ రవిబాబ్జీ తదితరులు తహసీల్దార్‌ను కలిసి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. అలాగే తూర్పుకాపు సంక్షేమ సంఘం, టెక్కలి నియోజకవర్గ కార్యదర్శి వి.దివాకర్ ప్రతినిధులు టి.బలరాం, తూలుగు మహేష్ తదితరులు కలిసి వినతిపత్రం అందించి మిల్లర్ల దోపిడీని కట్టాలని కోరారు. బీజేపీ నాయకులు బి.నరేంద్రచక్రవర్తి, వై.కామరాజు, సీహెచ్ శీనివాసరావు, పి.క్రిష్ణవేణి, కాపు సంక్షేమ సంఘ నాయకులు ఎస్.లావన్న, సంజీవరావు, టి.లక్ష్మణరావు, పాల్గుణరావు తదితరులు ఉన్నారు.

సీఆర్పీల సమస్యలపై వినతి

ఎల్ఎన్ పేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సీఆర్పీ యూనియన్ నాయకత్వం పిలుపు మేరకు ఎల్ఎన్ పేట మండలంలోని సీఆర్పీలు ఈ రోజు భోజన విరామ సమయంలో తమ సమస్యలపై మండల తహీల్దారు, మండల విద్యాశాఖ అధికారుల ప్రతినిధులకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు పోలాకి తవిటినాయుడు, ఎల్ఎన్ పేట మండల సీఆర్పీలు సింహాచలం, అచ్యుతరావు, శ్రీధర్ పాల్గొన్నారు. సీఆర్పీలు ఎదుర్కొంటున్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఆరుతడి పంటలతో అధిక లాభాలు

మందస/హరిపురం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆరుతడి పంటలతో అధిక లాభాలు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ సీహెచ్ వెంకట్రావు, కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త కిరణ్ అన్నారు. మందస మండలం భిన్నలమథనాపురం, హరిపురం గ్రామాల్లో గురువారం ప్రధానమంత్రి రాష్ట్రీయ కృషి వికాసయోజన ఆత్మ పథకం ద్వారా రైతులకు వరి, మినుము, పెసర, మొక్కజొన్న, వేరుశనగ పంటల యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిగించారు. ఏవో నాగరాజు, ఏఈవో జ్యోత్స్న పాల్గొన్నారు.

మహాసభను విజయవంతం చేయండి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

మందస, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విశాఖ లో నిర్వహించే సీఐటీ యూ అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేయాలని సీఐటీయు కన్వీనర్లు కె.కేశవరావు, పి.దేవేం ద్ర పిలుపునిచ్చారు. మందసలో గురువారం విలేకరులతో మాట్లాడుతూ డిసెంబరు 31 నుంచి జనవరి 4 వరకూ నిర్వహించనున్నామని, జయప్రదం చేయాలని కోరుతూ పోస్టర్లను ఆవిష్కరించారు. సీఐటీయూ నాయకులు ఎం.ధర్మారావు, ఎస్.వల్లభమూర్తి, బి.చిన్నారావు పాల్గొన్నారు.

చేనేత రంగానికి సహకారం


ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సంఘ నాయకులు

నరసన్నపేట, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చేనేత రంగానికి ప్రభుత్వం చేయూత ఇస్తుందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. చేనేత మగ్గాలకు 200 యూనిట్ల విద్యుత్ ఉచితంగా ఇచ్చేందుకు జారీ చేసిన నేపథ్యంలో గురువారం నరసన్నపేట దేవాంగుల సంక్షేమ సంఘ, వీవర్స్ మబుగాంలో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బగ్గు రణమూర్తి మాట్లడుతూ.. చేనేత పరిశ్రమను ఆదరిస్తుందన్నారు. చేనేత కార్మికులకు పింఛన్లు, మగ్గాలు ఇవ్వడంతో పాటు పవర్‌లూమ్‌లను రాయితీపై అందిస్తుందన్నారు.

భూముల పరిశీలన

పలాసరూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఆఫ్‌షోర్ నిర్మాణంలో నిర్వాసితులైన 16మందికి చెందిన భూములు పూర్తిస్థాయిలో అందకపోవడంతో రెవెన్యూ అధికారులు గురువారం గోపివల్లభాపురం ప్రాంతంలో భూముల పరిశీలన చేపట్టారు. 16మందికి కావాల్సిన భూములను గోపివల్లభాపురం ప్రాంతంలో మెట్ట ప్రాంతంలో పరిశీలన చేపట్టారు. 16మందికి ఇవ్వాల్సిన భూముల్లో ఏ వైపు నుంచి అందజేయాలనే అంశంపై మ్యాప్‌ను ద్వారా వివరాలను రెవెన్యూ రికార్డుల్లో పరిశీలించారు. దీనిపై ఉన్నతాధికారుల నివేదికను అందజేసి అనంతరం భూముల కొలతలను స్పష్టం చేస్తామని తెలిపారు. పరిశీలనలో తహశీల్దార్ కళ్యాణచక్రవర్తి, సర్వేయరు గిరి, ఆర్ఐ ప్రసాద్, సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

ముఖాముఖీ మాట్లాడాలి

పోలాకి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల భవితపై ఉపాధ్యాయులు తల్లిదండ్రులతో ముఖాముఖిగా మాట్లాడాలని ఎంఈవోలు శ్రీనివాస్‌నాయక్, ఎస్.శ్రీనివాసరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం వారు మండలంలోని పలు పాఠశాలలను సందర్శించి మెగా పేరెంట్స్ సమావేశం ఎలా నిర్వహించాలో వివరించారు. సమావేశాన్ని 12 గంటల వరకూ సమావేశాలు కొనసాగించి, 12.30కి తల్లిదండ్రులకు, అతిథులు భోజనం పెట్టి ముగించాలన్నారు. అంపలాం ఉన్నత పాఠశాలకు స్థానిక దాతలు ఏసీని వితరణగా ఇవ్వడంపై హెచ్ఎం శ్రీనివాసరావు అభినందించారు.

మహాసభలను జయప్రదం చేయాలి

హిరమండలం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఈ నెల 31 నుంచి జనవరం 4వరకు జరగనున్న సీఐటీయు అఖిల భారత మహాసభలను జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి ఎం.అప్పారావు కోరారు. గురువారం మండల కేంద్రంలో సీఐటియు అఖిల భారత మహాసభల కరపత్రం ఆవిష్కరించారు. కార్మిక హక్కులను కార్పొరేట్ ల ప్రయోజనం కొరకు కాలరాస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటియు లక్ష్మణరావు, రాజేశ్వరి, కామాక్షి, లకి&, ఇను, శంకర్, నూకరాజు, జ్యోతి తదితరులు ఉన్నారు.

● హిరమండలం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం సీఆర్ఎంటీల సమస్యలు పరిష్కరించాలి కోరుతూ మండల ప్రతినిధులు గురువారం తహసిల్దారు ఎన్ని జోగారావుకు వినతి పత్రం అందజేశారు. సీఆర్ఎమ్‌టీలను విద్యాశాఖలో విలీనం చేసి,రెగ్యులర్ చేయాలని ట్రావెలింగ్ అలవెన్స్‌ను పునరుద్ధరించాలని ,డిఎస్‌ఈలో వె యిటేజీ ఇవాలని అలాగే మకికొన్ని సమస్యలను పరిష్కారం కోరుతూ తహసిల్దారుకు వినతి పత్రం అందజేశారు.

ఘనంగా దత్తాత్రేయ జయంతి

నందిగాం, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): దత్తాత్రేయ జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. కాపుతెంబూరు దత్తాశ్రమం, పెద్దతామరాపల్లి దత్త మందిరం, నందిగాం షిర్డీసాయి ఆలయాల్లో నిర్వాహకులు ఆధ్వర్యంలో కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిపారు. కాపుతెంబూరులో దత్త పీఠాధిపతి నిర్వీశ్వానంద స్వామీజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో క్రిష్ణా జిల్లా శ్రీరంగాపురంకు చెందిన సూర్యసదన ఆస్థానపండిత, రాష్ట్రపతి పురస్కార గ్రహీత డాక్టర్ పీటీజీవీ రంగాచార్యులు పాల్గొని ప్రతి ఒక్కరు భక్తిబావంతో మెలగాలన్నారు.

చెత్త నుంచి సంపద సృష్టించాలి

పాతపట్నం/రూరల్, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): చెత్తనుంచి సంపద సృష్టించాలని మండల గ్రామ, వార్డు సచివాలయాధికారి బి.కృష్ణారావు తెలిపారు. గంగువాడ సచివాలయంలో పంచాయతీరాజ్ ప్రేరణా ప్రగతిపై గురువారం సమీక్షించారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ మెరుగైన సేవలందించాలని అందుకు పలుసూచనలు సలహాలిచ్చారు. సమయపాలన పాటించకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

యూటీఎఫ్ నూతన కార్యవర్గం

సంతబొమ్మాళి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ మండల శాఖ నూతన కార్యవర్గాన్ని సంతబొమ్మాళి ఆదర్శ పాఠశాల్లో ఏకగ్రీవంగా గురువారం ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా కానూరు ఆనందరావు, అధ్యక్షుడిగా యర్నాగుల సింహాచలం, ఉపాధ్యక్షులుగా సంకు రాజ్‌కుమార్, చదువుల మాలతి, ప్రధాన కార్యదర్శిగా గౌడు మోహనరావు, కోశాధికారి మూల రమణ, ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా బడగల వెంకటగిరి, మహిళ కమిటీ కన్వీనర్‌గా దుంగ జయలక్ష్మి, సీపీఎస్ కన్వినర్‌గా వంజరాపు సీతంనాయుడు, అకడమిక్ సెల్ కన్వీనర్‌గా సడగాన గురునాథ్ ఎన్నికయ్యారు.

నేడు మెగా వైద్యశిబిరం

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): పూండి-గోవిందపురంలో శుక్రవారం మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్టు గోవిదంపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమేష్‌కుమార్ పట్నాయక్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రత్యేక సేవా శిబిరంలో భాగంగా మెడికల్ క్యాంపు ఏర్పాటు చేస్తున్నట్టు పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పీవో రూప్‌సుందర్, అధ్యాపకులు ఉన్నారు.

వృద్ధులకు దుప్పట్ల పంపిణీ

కోటబొమ్మాళి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): స్థానిక కొత్తమ్మతల్లి ఆలయ ప్రాంగణంలో స్థానిక టీడీపీ నాయకుడు నౌగాపు నాగరాజు గురువారం పేదలకు, యాచకులకు దుప్పట్లను పంపిణీ చేశారు. సంతబొమ్మాళి మండలం వల్లేవలస గ్రామానికి చెందిన మా బడి స్వచ్ఛంద సేవా సంస్థ ఆర్థిక సాయంతో 500 మంది పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు రెడ్డి సూరిబాబు మాస్టారు, ఇప్పిటి అప్పన్న, శివారెడ్డి, నౌగాపు సుశీల తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీగణపతి యాగం

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): డివిజన్ కేంద్రమైన టెక్కలిలో కొలువై ఉన్న రాధాకాంతస్వామి, అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం నుంచి ఏడు రోజుల పాటు లక్ష్మీగణపతి సహిత పంచాయతన యాగం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తొలిరోజు విఘ్నేశ్వరపూజ, విశేష యాగ సంకల్పం, పుణ్యాహవచనం, దీక్షారాధన, అంకురారోహణ తదితర కార్యక్రమాలు జరుగుతాయన్నారు. చివరిరోజు యాగం ముగింపుతో పాటు మహా పూర్ణాహుతి, లక్ష్మీగణపతి శాంతికల్యాణం, మహాదాశీర్వచనాలు ఉంటాయని తెలిపారు. అదేరోజు మధ్యాహ్నం మహా అన్నప్రసాద వితరణ ఉంటుందన్నారు.

శిక్షణతో ఉపాధి అవకాశాలు

టెక్కలి, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి అవకాశాలకు దారిచూపే శిక్షణను ఐతమ్‌లో గురువారం ప్రారంభించినట్టు డైరెక్టర్ వీవీ నాగేశ్వరరావు తెలిపారు. విద్యార్థులకు దేశీయ, అంతర్జాతీయ స్థాయిలో విస్తృత ఉపాధి అవకాశాలు లభిస్తాయని, సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల పనితీరు మెరుగుపరిచేందుకు ర్యాంపు పథకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు పి.శ్రీహరి, విజయకృష్ణకాంత్, శ్రీరాములు, ఆజాద్, రమణ, సతీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠేశ్వర స్వామివారి ఆదాయం రూ.26,496

పాతపట్నం, డిసెంబరు 4(ఆంధ్రజ్యతి): స్థానిక నీలకంఠేశ్వరుని ఆలయానికి గత 8నెలలకు గానూ రూ.26,496 ఆదాయం లభించినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. సహాయ కమీషనర్ వారి ఆదేశాలమేరకు ఆశాఖ టెక్కలి గ్రూప్ దేవాలయాల కార్యనిర్వాహణాధికారిణి టీపీ మనస్వి పర్యవేక్షణలో గురువారం నీలకంఠేశ్వరుని ఆలయహుండీలను లెక్కించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు భక్తులు సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

జలుమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సేవలను అందిస్తున్న వీఆర్ఏ పట్ల సానుభూతితో వ్యవహరించి తమ సమస్యలను పరిష్కరించాలని వీఆర్ఏలు గురువారం తహసీల్దార్ జె.రామారావును కోరారు. తక్షణమే పేస్కేల్, జీతాలు పెంచాలని, పదోన్నతులు కల్పించాలని, నామినీలుగా పనిచేస్తున్నవారిని రెగ్యూలర్ చేయాలని వినతి పత్రం అందజేశారు.

విద్యాశాఖలో విలీనంచేయాలి

నరసన్నపేట/ జలుమూరు, డిసెంబరు 4(ఆంధ్రజ్యోతి): విద్యావ్యవస్థలో లైన్ ఏజెన్సీవలే సేవలను అందిస్తున్న క్లస్టర్ రిజర్వుమొబైల్ టీచర్స్(సీఆర్ఎంటీ)లను విద్యాశాఖలో విలీనంచేయాలని సీఆర్ఎంటీలు ఎంఈవోలు, తహసీల్దార్లుకు వినత పత్రం అందజేశారు. గురువారం నరసన్నపేట, జలుమూరు ఎమ్మార్సీలు వద్ద తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ధర్నా చేపట్టారు. అనంతరం ఎంఈవోలకు వినతి పత్రం అందజేశారు.